


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

ఈ స్థలం [22 సెంట్లు]
**అమ్మబడును**




కె. అబెద్నేగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243
RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 183 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ గురువారం 26 మార్చి 2026 పేజీలు : 12 వెల : 2/-

ఎల్పీజీ నుంచి పీఎన్‌జీ వైపు

## మళ్లిస్తాం..

మంత్రి నాదెండ్ల మనోహర్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులతో కొందరు ముందు జాగ్రత్తగా బుకింగ్‌లు చేస్తున్నారని చెప్పారు. పైప్డ్ గ్యాస్‌పై కొత్త పాలసీ తీసుకువచ్చేలా ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందన్నారు. "వాణిజ్య అవసరాలకు ఇచ్చే గ్యాస్ సరఫరాను కేంద్రం పెంచింది. రెస్టరంట్లు, విద్యా సంస్థలకు సరఫరా పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. పట్టణాల్లో

మిగతా .. 2లో..

## ఆ 450 కిలోల యురేనియం ఇచ్చేయాలి

ఇరాన్‌కు ట్రంప్ 15 కండీషన్స్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో అమెరికా ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. ఇందులో భాగంగానే కాల్పుల విరమణ కోసం 15 పాయింట్లతో కూడిన ప్రణాళికను అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు పంపినట్లు తెలుస్తోంది. అదే సమయంలో పశ్చిమాసియాకు అదనపు బలగాలను పంపించేందుకు అమెరికా సిద్ధమవుతుండటం గమనార్హం. ఈ శాంతి ప్రణాళికను పాకిస్థాన్ ప్రతినిధుల ద్వారా అమెరికా ఇరాన్‌కు పంపించినట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ కథనం రాసింది. ఈ సీజ్ ఫైర్ ప్లాన్ గురించి ఇజ్రాయెల్‌కు అగ్రరాజ్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. అయితే, ఈ కథనాలపై వైట్‌హౌస్ నుంచి స్పందన రాలేదు. యుద్ధం ముగింపు కోసం ఈ ప్రణాళికలో టెహ్రాన్‌కు కొన్ని

మిగతా .. 2లో..

## శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ పోరాడతాం : ఇరాన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** యుద్ధం ముగించే విషయంపై చర్చలు కొనసాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొంటుండగా.. ఇరాన్ అధికారుల నుంచి వస్తున్న వ్యాఖ్యలు అందుకు భిన్నంగా ఉన్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ చేసిన దురాక్రమణకు.. వారు పశ్చాత్తాప పడేవరకూ తమ ప్రతీకార దాడులు కొనసాగుతూనే ఉంటాయని తాజాగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో ఆయన చర్చించారు. ఈ క్రమంలోనే అరాగ్చీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఇరాన్ పౌర, రక్షణ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేయడమే.. ఈ ప్రాంతంలో అస్థిరతకు కారణమని అరాగ్చీ పేర్కొన్నారు. తమ లక్ష్యాలన్నీ నెరవేరి..

మిగతా .. 2లో..

పశ్చిమగోదావరి జిల్లాలో అభివృద్ధి పనులకు

# సీఎం చంద్రబాబు అనుమతి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాప్రతినిధులతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవి, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, అంజిబాబు, పితాని, అరిమిల్లి, బొలిశెట్టి, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు. వివిధ సర్వేల ద్వారా వచ్చిన నివేదికలను ప్రజాప్రతినిధులు.. చంద్రబాబుకు అందించారు. ప్రభుత్వ పథకాల అమల్లో ఎక్కడా ఇబ్బంది రాకుండా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు అనుమతి ఇచ్చారు. ఉంగుటూరు పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చేందుకు అంగీకరించారు. తణుకులో రూ.28 కోట్లతో విజయవాడ-విశాఖ రోడ్డు మరమ్మతులకు ఆమోదం తెలిపారు.

పది ఎకరాల్లో తణుకు ఆటోనగర్ నిర్మాణానికి పచ్చజెండా

ఎర్రకాలువ, ఏలూరు కాల్వలపై వంతెనల నిర్మాణానికి సీఎం అంగీకారం

ఆచంటలో వశిష్ఠ నదిపై రూ.110 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం

నరసాపురంలో రూ.25 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు సుముఖత

ఉండి కెనాల్, కలువపూడి సహా వివిధ కాల్వలపై బ్రిడ్జి, రోడ్డుకు అంగీకారం

10 ఎకరాల్లో భీమవరం డంపింగ్ యార్డు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

యనమదుర్రు మేజర్ డ్రెన్‌కు అప్రోచ్ రోడ్ల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారు.

పాక్ మాదిరి

## 'దళారీ'గా వ్యవహరించలేం

విదేశాంగ మంత్రి జైశంకర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ.. అమెరికా-ఇరాన్‌ల మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావే శంలో ఇదే అంశం ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందిస్తూ.. పాక్ చేస్తున్న ప్రయత్నాల్లో కొత్తేమీ లేదని, 1981 నుంచి ఆ దేశాన్ని అమెరికా ఉపయోగించుకుంటోందని చెప్పినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ మధ్యవర్తిత్వం

మిగతా .. 2లో..

## ఐఆర్‌సీటీసీలో 3కోట్ల నకిలీ ఖాతాల తొలగింపు



కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

**విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులైన ప్రయాణికులందరికీ టికెట్లు లభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగానే ఐఆర్‌సీటీసీ పోర్టల్ నుంచి దాదాపు

మిగతా .. 2లో..

బొలిశెట్టి సత్యనారాయణతో

## పార్టీకి ఎలాంటి అనుబంధం లేదు

జనసేన





**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** బొలిశెట్టి సత్యనారాయణకు పార్టీతో ఎలాంటి అనుబంధం లేదని జనసేన తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "బొలిశెట్టి సత్యనారాయణ తన వ్యక్తిగత సిద్ధాంతాలను అనుసరించే నిమిత్తం పదవీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అంగీకరించారు. బొలిశెట్టి చేపట్టే కార్యక్రమాలతో పార్టీకి సంబంధం లేదు" అని జనసేన పేర్కొంది.

వార్నింగ్ ఇచ్చిన గంటలోపే..

'అబ్రహాం లింకన్'పై

## ఇరాన్ దాడులు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియా ఘర్షణల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఈ విమాన వాహకనౌక కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నామని, లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించిన గంటలోపే

మిగతా .. 2లో..

## అమరావతి అభివృద్ధిపై మంత్రి స్పష్టత

హెచ్‌ఓడీ టవర్-3 పనులకు శ్రీకారం - డైగ్రిడ్ సాంకేతికతతో ఐకానిక్ టవర్ల నిర్మాణం

రాజధాని అభివృద్ధిని అడ్డుకుంటే కఠిన చర్యలు : మంత్రి నారాయణ




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం స్పష్టమైన లక్ష్యం, దృష్టితో ముందుకు సాగుతోందని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాష్ట్ర స్థాయి అధికారులను ఒకే ప్రదేశంలో సమీకరించేందుకు నిర్మిస్తున్న ఐదు ఐకానిక్ టవర్లలో భాగంగా హెచ్‌ఓడీ టవర్-3 కార్నర్ నోడ్ పనులను అధికారికంగా ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ టవర్లు అధునాతన డైగ్రిడ్ సాంకేతికతతో నిర్మించబడుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా నిర్మాణం బలంగా ఉండటంతో పాటు ఆధునిక శైలిలో రూపుదిద్దుకుంటుందని చెప్పారు. పరిపాలనలో సమర్థత పెంచడమే లక్ష్యంగా ఈ టవర్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అమరావతి స్వయంపోషిత నగరంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ప్రత్యేక ఆర్థిక నమూనా ద్వారా నగర నిర్మాణం కొనసాగుతోందని, దీని ద్వారా ప్రభుత్వంపై అదనపు భారం లేకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల అమరావతిలో జరిగిన అగ్నిప్రమాదంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించినట్లు మంత్రి చెప్పారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజధాని

మిగతా .. 2లో..

వ్యవసాయంలో గ్లోబల్ కనెక్ట్..

## సింగపూర్‌తో ఏపీ చర్చలు

- సింగపూర్ ప్రతినిధులతో మంత్రి అచ్చెన్నాయుడు వీడియో కాన్ఫరెన్స్
- డేటా ఆధారిత పాలసీల దిశగా అడుగులు
- ఎగుమతుల పెంపు, పెట్టుబడుల ఆకర్షణపై మంత్రి వివరణ
- తీర ప్రాంత అభివృద్ధి, మత్స్య రంగంపై ప్రత్యేక దృష్టి
- వ్యవసాయం, ఆహార భద్రత, సరఫరా వ్యవస్థలపై విస్తృత చర్చలు
- ఫుడ్ సెక్యూరిటీ నుంచి లాజిస్టిక్స్ వరకూ.. సమగ్ర చర్చలు జరిపిన మంత్రి అచ్చెన్న



**అమరావతి/ విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సింగపూర్ దేశ ప్రతినిధులతో బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుండి కీలక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ రంగంలో గ్లోబల్ కనెక్టివిటీ, ఆహార భద్రత, సరఫరా వ్యవస్థలు, ఆధునిక సాంకేతికత వినియోగంపై విస్తృతంగా చర్చించారు. సింగపూర్ దేశం తన అవసరాల కోసం సుమారు 80 శాతం ఆహార ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, ఆ దేశం అనుసరిస్తున్న ఆహార భద్రతా విధానాలు, నిల్వ పద్ధతులు, సరఫరా అనుబంధాల నిర్వహణపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల సంరక్షణ చర్యలు, సమయానికి సరఫరా, సమర్థవంతమైన రవాణా నిర్వహణపై సింగపూర్ ప్రతినిధులు అమలు చేస్తున్న

మిగతా .. 2లో..

లోకేశ్‌కు మంచి పేరు రావడం చూసి

## జగన్ రగిలిపోతున్నారు

మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్.. ఉత్తరాంధ్రను ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చనుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్టీల్ ప్లాంట్ వచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ చేసిన కృషే ప్రధాన కారణమని చెప్పారు. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమల క్రెడిట్ తనదేనని జగన్ అంటున్నారని మండిపడ్డారు. మొన్న గూగుల్ డేటా సెంటర్, నేడు మిత్తల్ స్టీల్ ప్లాంట్‌పై తనకు అలవాటైన అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. లోకేశ్‌కు మంచి పేరు రావడం చూసి రగిలిపోతున్నారని చెప్పారు. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా లోకేశ్ స్టీల్ ప్లాంట్ తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు లక్షన్నర మందికి ఉపాధి లభించనుందన్నారు.

**మాట తప్పి, మడమ తిప్పిన వ్యక్తి జగన్: మంత్రి గొట్టిపాటి**

ఇచ్చిన హామీలపై మాట తప్పి, మడమ తిప్పిన వ్యక్తి జగన్ అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఇసుక దోపిడీతో నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. ఆస్తులు కొల్లగొట్టడం, వ్యవస్థల నిర్వీర్యం తప్ప ఆయన చేసిందేమీ లేదన్నారు. మద్యనిషేధం హామీతో వచ్చి కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. తల్లికి వందనం పథకాన్ని ఒక బిడ్డకే పరిమితం చేసి మోసం చేశారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం వచ్చాక గుండ్లకమ్మ ప్రాజెక్టును బాగు చేసిందని తెలిపారు.

అమెరికా ప్రతిపాదనను

## తిరస్కరించిన ఇరాన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో కాల్పుల విరమణకు అమెరికా చేసిన ప్రతిపాదనను ఇరాన్ తోసిపుచ్చింది. తమ డిమాండ్లు నెరవేరినప్పుడు, తాము నిర్ణయించుకున్నప్పుడు మాత్రమే యుద్ధం ముగుస్తుందని స్పష్టం చేసింది. అప్పటివరకు పశ్చిమాసియాలో భారీ స్థాయిలో దాడులు కొనసాగిస్తామని తెలిపింది. ఈ మేరకు ఇరాన్ కీలక అధికారి వెల్లడించిన వివరాలను అక్కడి అధికారిక మీడియా ప్రసారం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వం

మిగతా .. 2లో..

నేను బతికున్నంత వరకు

## ఎన్నార్సీని అనుమతించను

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటరు జాబితా సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులు లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇందుకోసం రాజ్యాంగ సంస్థలను వాడుకుంటున్నారన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను ఏమాత్రం పాటించట్లేదని మండిపడ్డారు. ఈ రోజు ఓటుహక్కును లాక్కున్న వారు రేపు ఎన్నార్సీని తీసుకువచ్చి.. పౌరసత్వాన్ని కూడా

మిగతా .. 2లో..

విజయమ్మ రాసిన ఉత్తరంలోని అంశాలు

## సుప్రీంకోర్టు తీర్పుతో సమానం

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ కుటుంబ ఆస్తుల విషయంలో విజయమ్మ రాసిన ఉత్తరంలోని అంశాలు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల చెప్పారు. పులివెందుల అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఆమె కడప కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇచ్చారు. అరటి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సందర్భంలో జగన్ 2024 మార్చి 11న ఎన్నికల ముందు పులివెందులలో అరటి ప్రాసెసింగ్ యూనిట్ హడావుడిగా ఏర్పాటు చేసి వెళ్లిపోయారని షర్మిల విమర్శించారు. ప్రతి చిన్న విషయానికి వైకాపా నాయకులు తనను లక్ష్యంగా చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఆస్తుల విషయంలో కూడా తాము పదేపదే నిజాలు చెబుతుంటే కొందరు

మిగతా .. 2లో..

క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటిన

## భారతీయ వర్సిటీలు




**విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ స్థాయిలో భారతీయ విద్యాసంస్థలు మరోసారి సత్తా చాటాయి. విశ్వవిద్యాలయాలకు సంబంధించి ప్రతిష్ఠాత్మక క్వాకరెల్లి సైమండ్స్ సంస్థ 'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ బై సబ్జెక్ట్' పేరిట ర్యాంకులను విడుదల చేసింది. ఇందులో ప్రపంచంలోని టాప్- 50 వర్సిటీల జాబితాలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి భారత్ నుంచి నాలుగు ఐఐటీలు, జేఎన్‌యూ, బిట్స్ పిలానీ చోటు దక్కించుకోవడం విశేషం. 100కి పైగా దేశాల్లోని

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## ఎల్పీజీ నుంచి పీఎన్‌జీ వైపు మళ్లిస్తాం..

ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చు. సోలార్, ఇండక్షన్ కుకింగ్ స్టవ్‌లను వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో అమ్మకుండా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాం. అక్రమాలపై 800 కేసులు నమోదు చేసి 3,540 సిలిండర్లు సీజ్ చేశాం. బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా వన్ టైమ్ పాస్‌వర్డ్ ద్వారానే గ్యాస్ సరఫరా జరపాలని ఆదేశాలిచ్చాం. అర్హత లేని వారి చేతుల్లోకి సిలిండర్లు వెళ్లకుండా చూసుకునే బాధ్యత మాపై ఉంది. పట్టణాల్లోని ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చు. పట్టణాల్లోని వినియోగదారులను ఎల్పీజీ నుంచి పీఎన్‌జీ వైపు మళ్లిస్తాం. రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదు" అని తెలిపారు.

## 'అబ్రహాం లింకన్'పై ఇరాన్ దాడులు

దాడి చేసింది. దానికి సంబంధించిన వీడియోను ఇరాన్ మీడియా విడుదల చేసింది. యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో అమెరికా ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. ఇందులోభాగంగానే నెల రోజుల కాల్పుల విరమణ కోసం 15 పాయింట్లతో కూడిన ప్రణాళికను ఇరాన్‌కు పాకిస్థాన్ అందించింది. ఇలాంటి సమయంలో తాజా ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై అమెరికా ఎలా స్పందిస్తుందనే దానిపై ఆందోళన నెలకొంది. అబ్రహాం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల పేర్కొంది. ఆ ప్రకటనను అప్పట్లో అమెరికా తోసిపుచ్చింది.

అమెరికా ప్రతిపాదనను

## తిరస్కరించిన ఇరాన్

వహిస్తోన్న పాకిస్థాన్.. కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్‌కు తెలిపిన అనంతరం ఈమేరకు ప్రకటన వెలువడింది.

**15వేల బాంబులేశాం: ఇజ్రాయెల్**

ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు ఇరాన్‌పై 15వేల బాంబులు జారవిడిచినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. గతేడాది జూన్‌లో చేసిన దాడులతో పోలిస్తే నాలుగు రెట్లు అధికమని పేర్కొంది. ఈ మేరకు ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్, ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఇయాల్ జమీర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యుద్ధం మొదలైన తొలి రోజుల్లో అమెరికా, ఇజ్రాయెల్‌లు నిత్యం వెయ్యి బాంబులను జారవిడిచినట్లు చెప్పారు.

**లెబనాన్‌లో 1094 మంది మృతి**

ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో లెబనాన్‌లో ఇప్పటివరకు 1094 మంది ప్రాణాలు కోల్పోయినట్లు లెబనాన్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. గడిచిన 24 గంటల్లోనే 22 మంది చనిపోయినట్లు పేర్కొంది. మృతుల్లో 121 మంది చిన్నారులు, 81 మంది మహిళలు ఉన్నట్లు తెలిపింది.

## ఆ 450 కిలోల యురేనియం ఇచ్చేయాలి

షరతులు విధించింది.

**అవేంటంటే..**

ఇరాన్ తనకున్న అణుసామర్థ్యాలను తప్పనిసరిగా నిర్వీర్యం చేయాలి. నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డో అణు కేంద్రాలను ధ్వంసం చేయాలి.

అణ్వాయుధాలు ఎప్పటికీ సమకూర్చుకోబోమని ఇరాన్ హామీ ఇవ్వాలి.

ఇరాన్ భూభాగంపై అణుశుద్ధి జరగకూడదు

ఇరాన్ తన వద్ద నిల్వ ఉంచుకున్న 450 కిలోల యురేనియంను ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి అప్పగించాలి.

హర్మూజ్ జలసంధిని తెరవాలి. దాన్ని ఫ్రీ మారిటైమ్ కారిడార్‌గా నిర్వహించాలి.

ఇరాన్ క్షిపణి కార్యక్రమాలను పరిమితంగా చేపట్టాలి. వాటి రేంజ్, సంఖ్యను తగ్గించుకోవాలి. ఆత్మరక్షణ కోసం క్షిపణులను ఉపయోగించుకోవాలి.

**మరో 1000 మంది బలగాలు..**

ఈ షరతులకు అంగీకరిస్తే.. ఇరాన్‌పై అంతర్జాతీయ సమాజం విధించిన ఆంక్షల్ని పూర్తిగా ఎత్తేస్తామని అమెరికా ఈ ప్రణాళికలో హామీ ఇచ్చింది. అంతేగాక.. పౌర అణు ఇంధనశక్తిని పెంపొందించుకొనే కార్యక్రమాలకు సాయం అందిస్తామని తెలిపింది. అయితే, ఓవైపు శాంతి ప్రణాళికను ఆఫర్ చేస్తూ పశ్చిమాసియాకు అగ్రరాజ్యం బలగాలను పంపించేందుకు సిద్ధమైంది. మరో 1000 మంది సైన్యంతో పాటు రెండు మెరైన్ యూనిట్లను ఈ ప్రాంతంలో మోహరించేందుకు పెంటగాన్ సన్నాహాలు చేస్తోంది.

**ఓటమిని ఒప్పందం అనొద్దు: ఇరాన్**

కాగా.. ఈ సీజ్‌ఫైర్ ప్లాన్‌పై ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి స్పందిస్తూ అమెరికాపై విమర్శలు గుప్పించారు. "మీ ఓటమిని శాంతి ఒప్పందంగా పిలవొద్దు. ఈ ప్రాంతంలో మీ పెట్టుబడులను మేం అంగీకరించబోం" అని ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి స్పష్టంచేశారు. యుద్ధం ముగింపుపై అమెరికాతో చర్చల వార్తలను కూడా ఖండించారు.

ఐఆర్‌సీటీసీలో 3కోట్ల నకిలీ ఖాతాల తొలగింపు: అశ్వినీ వైష్ణవ్

**విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులైన ప్రయాణికులందరికీ టికెట్లు లభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగానే ఐఆర్‌సీటీసీ పోర్టల్ నుంచి దాదాపు 3 కోట్ల నకిలీ ఖాతాలను తొలగించినట్టు తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో రైల్వే టికెట్లపై అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. "దళారుల టికెట్ల విక్రయానికి అడ్డుకట్ట వేసి.. ప్రయాణికులకు టికెట్లను అందుబాటులో ఉంచడం కోసం 3కోట్ల నకిలీ ఖాతాలను ఐఆర్‌సీటీసీ తొలగించింది. సౌకర్యవంతమైన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వం 75వేల ప్రత్యేక రైలు సర్వీసులను నడిపింది" అని రైల్వేశాఖ మంత్రి పేర్కొన్నారు. రైలు ప్రయాణాల భద్రతపై మరింత దృష్టి సారించడం వల్ల ప్రమాదాలు 90 శాతం మేర తగ్గాయని మంత్రి చెప్పారు.

## శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ పోరాడతాం : ఇరాన్

హింసాత్మక దురాక్రమణకు పాల్పడినందుకు గాను శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు కొనసాగుతాయన్నారు. తమ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడం తమ మొదటి ప్రాధాన్యం అని వెల్లడించారు. హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో సహా తాము తీసుకున్న చర్యలన్నీ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే ఉన్నాయన్నారు.

**ఇరాన్ నేతలకు ఇమ్యూనిటీ..**

ఇదిలాఉండగా.. అమెరికా- ఇరాన్ మధ్య దౌత్య చర్చలకు అడుగులు పడుతుండగా.. కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో పాటు పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్‌కు అమెరికా- ఇజ్రాయెల్ తాత్కాలిక రక్షణ కల్పించాయి. చర్చలు కొనసాగుతున్నంతకాలం ఈ రక్షణ ఉంటుందని ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

పాక్ మాదిరి

## 'దళారీ'గా వ్యవహరించలేం

వహించదని స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**ఇంధన భద్రతకు ఢోకా లేదు..**

దేశ ఇంధన భద్రతకు ఎటువంటి ఢోకా లేదని, మనకు సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఇంధన సరఫరాలో అంతరాయం లేకుండా చూసేందుకు వీలుగా వివిధ దేశాల నుంచి దిగుమతి కోసం సంప్రదింపులు కొనసాగిస్తూనే ఉన్నామని పేర్కొంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్‌లు కూడా చేసుకున్నట్లు తెలిపింది. ఎల్‌పీజీ లభ్యత, హర్మూజ్ జలసంధి నుంచి సరుకు రవాణాపై విపక్షాలు లేవనెత్తిన ఆందోళనలపై స్పందిస్తూ.. మరిన్ని నౌకలు మార్గమధ్యలో ఉన్నాయని పేర్కొంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో ఈ భేటీ కొనసాగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు సహా పలువురు మంత్రులు పాల్గొన్నారు. కాంగ్రెస్ తరపున తారిక్ అన్వర్, ముకుల్ వాస్నిక్ హాజరు కాగా.. సమాజ్‌వాదీ పార్టీ, బిజు జనతాదళ్‌తోపాటు పలు పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, భారత్ తీసుకుంటున్న చర్యలను విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వివరించారు. అయితే, ఇటువంటి పరిస్థితుల్లో భారత్ మౌనంగా ఉంటోందని విపక్షాలు చేసిన ఆరోపణలకు బదులిస్తూ.. అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అయినప్పటికీ, ఈ సమావేశం నిరాశ కలిగించిందని విపక్షాలు పేర్కొన్నాయి. ఇదే అంశాన్ని ఉభయ సభల్లో చర్చించాలన్నదే విపక్షాల ప్రధాన డిమాండ్ అని కాంగ్రెస్ నేత తారిక్ అన్వర్ పేర్కొన్నారు.

## ఐఆర్‌సీటీసీలో 3కోట్ల నకిలీ ఖాతాల తొలగింపు

3 కోట్ల నకిలీ ఖాతాలను తొలగించినట్టు తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో రైల్వే టికెట్లపై అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. "దళారుల టికెట్ల విక్రయానికి అడ్డుకట్ట వేసి.. ప్రయాణికులకు టికెట్లను అందుబాటులో ఉంచడం కోసం 3కోట్ల నకిలీ ఖాతాలను ఐఆర్‌సీటీసీ తొలగించింది. సౌకర్యవంతమైన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వం 75వేల ప్రత్యేక రైలు సర్వీసులను నడిపింది" అని రైల్వేశాఖ మంత్రి పేర్కొన్నారు. రైలు ప్రయాణాల భద్రతపై మరింత దృష్టి సారించడం వల్ల ప్రమాదాలు 90 శాతం మేర తగ్గాయని మంత్రి చెప్పారు.

## అమరావతి అభివృద్ధిపై మంత్రి స్పష్టత

నిర్మాణానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని, వేగవంతంగా పనులు పూర్తి చేయడంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

వ్యవసాయంలో గ్లోబల్ కనెక్ట్..

## సింగపూర్‌తో ఏపీ చర్చలు

విధానాలను వారు వివరించారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి ఉన్న అవకాశాలు, ఎగుమతుల పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, పెట్టుబడుల ఆహ్వానం వంటి అంశాలపై మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. రైతులకు లాభసాటి ధరలు అందించే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. పబ్లిక్ పాలసీల రూపకల్పనలో సాధారణ ప్రజల అభిప్రాయాలను ఎలా సేకరిస్తారు, వాటిని ఎలా అమలు చేస్తారు అనే అంశంపై ఇరు పక్షాల మధ్య చర్చ జరిగింది. సింగపూర్ ప్రతినిధులు డేటా అనలిసిస్, యుటిలైజేషన్ ద్వారా పాలసీలను ఎలా రూపొందిస్తారో వివరించారు. ఈ విధానాలను రాష్ట్రంలో కూడా అమలు చేసే అవకాశాలపై మంత్రి ఆసక్తి వ్యక్తం చేశారు. సముద్ర తీర ప్రాంత అభివృద్ధి, తీర ప్రాంత వ్యవసాయం, మత్స్య రంగానికి సంబంధించిన అవకాశాలు, తీర ప్రాంత మౌలిక సదుపాయాల పెంపు వంటి అంశాలపై కూడా చర్చించారు. సింగపూర్ లో అమలు చేస్తున్న ఆధునిక తీర అభివృద్ధి నమూనాలను రాష్ట్రంలో అనుసరించే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కోల్డ్ స్టోరేజ్ మేనేజ్‌మెంట్ పై కూడా ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఆహార ఉత్పత్తుల నిల్వ, నాణ్యత పరిరక్షణ, నష్టాలను తగ్గించే విధానాలు, ఆధునిక కోల్డ్ చైన్ వ్యవస్థలపై ఇరు పక్షాలు ప్రశ్నలు అడిగి సమాధానాలు ఇచ్చుకున్నారు. ఈ రంగంలో సాంకేతిక సహకారం పెంపుపై చర్చించారు. ఇరు దేశాల మధ్య వ్యవసాయ రంగంలో సహకారం, జ్ఞాన మార్పిడి, పెట్టుబడుల అవకాశాలు మరింత బలోపేతం అవుతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆధునిక వ్యవసాయ విధానాలు, సరఫరా వ్యవస్థలను మెరుగుపరచడానికి ఈ చర్చలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఆఫిషియో, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేను బతికున్నంత వరకు

## ఎన్నార్సీని అనుమతించను

లాక్కుంటారని దుయ్యబట్టారు. తాను ప్రాణాలతో ఉన్నంత వరకు రాష్ట్రంలో ఎన్నార్సీని అనుమతించనన్నారు. నక్సల్‌బరీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మమత ఈ వ్యాఖ్యలు చేశారు. 'సర్' పేరుతో రాష్ట్రంలోని లక్షల మంది అర్హులైన ఓటర్ల పేర్లను ఈసీ తొలగించిందని ఆమె ఆరోపించారు. దీనివల్ల అనేక మంది మైనారిటీ ఓటర్లు, వలస కార్మికులు నష్టపోయారన్నారు. ఏకపక్షంగా ఈ తొలగింపులు చోటుచేసుకున్నాయని, తమ స్థానికతను నిరూపించుకోవడానికి బెంగాల్ ప్రజలకు ఒక్క అవకాశమూ ఇవ్వలేదని విమర్శించారు. సర్ పని ఒత్తిడితో రాష్ట్రంలో 220 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వీటిపై ప్రశ్నిస్తూ బెంగాల్ ప్రజలకు తాను తోడుగా నిలబడం వల్లే తమ ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భాజపా, ఎన్నికల కమిషన్ పని తీరుపై నమ్మకం లేదని మమత అన్నారు. నామినేషన్ వేసేందుకు వెళ్లే సమయంలో అభ్యర్థులు వారితో పాటు లాయర్లను తీసుకెళ్లి.. ప్రతి పత్రాన్ని జాగ్రత్తగా తనిఖీ చేసుకోవాలని సూచించారు.

విజయమ్మ రాసిన ఉత్తరంలోని అంశాలు

## సుప్రీంకోర్టు తీర్పుతో సమానం

వైకాపా నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తుల విషయంలో తన తల్లి విజయమ్మ సుప్రీంకోర్టు తీర్పుతో సమానమైన విషయాలను ఉత్తరం ద్వారా విడుదల చేసినా.. ఇంకా కొందరు వాగుతూనే ఉన్నారని తెలిపారు. విజయమ్మ లెటర్ అందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో సమానమేనని పేర్కొన్నారు. ఇక ఎవరూ ఆస్తుల విషయం మాట్లాడకూడదని చెప్పారు.

క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటిన

## భారతీయ వర్సిటీలు

1900 వర్సిటీలకు చెందిన 21వేల అకడమిక్ ప్రోగ్రామ్‌లను.. 55 శాస్త్రీయ విభాగాలు, ఐదు ప్రధాన ఫ్యాకల్టీ విభాగాలను విశ్లేషించి ఈ ర్యాంకులను రూపొందించింది. ఇందులో ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలైన ఐఐటీ దిల్లీ, ఐఐటీ బాంబే, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ మద్రాస్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, బిట్స్‌పిలానీ చోటు దక్కించుకున్నాయి. అయితే, 2024లో భారత్ కేవలం 12 సబ్జెక్టుల్లో మాత్రమే టాప్- 50లో నిలవగా.. ఈసారి ఆ సంఖ్య 27కి చేరడం విశేషం. మినరల్ అండ్ మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో ధన్‌బాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ యూనివర్సిటీ 21వ ర్యాంకు సాధించింది. బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, మార్కెటింగ్ ఈ రెండింటిలోనూ ఐఐఎం అహ్మదాబాద్ 21వ ర్యాంకుతో మెరిసింది.

**సత్తా చాటిన ఐఐటీ దిల్లీ**

ఈ ఎడిషన్‌లో ఐఐటీ దిల్లీ మరింత ప్రతిభను కనబరిచింది. తొలిసారిగా ఆరు ప్రధాన ఇంజినీరింగ్ సబ్జెక్టులలో టాప్- 50లో ఒకటిగా నిలిచి సత్తా చాటింది. కెమికల్ ఇంజినీరింగ్ (48వ స్థానం), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ (36), మెకానికల్, ఏరోనాటికల్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇంజినీరింగ్ (44) ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ బ్రాడ్ ఏరియా (36), కంప్యూటర్ సైన్స్ విభాగంలో 45వ స్థానంతో అత్యుత్తమ విద్యాసంస్థగా నిలిచింది.

## రాయవరంలో ప్రజా ప్రతినిధులకు ఆర్.జి.ఎస్.ఎ శిక్షణా కార్యక్రమం




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేత ప్రక్రియలో భాగంగా మండల కేంద్రమైన రాయవరంలో గల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఒకరోజు ఆర్ జి ఎస్ ఏ కార్యాచరణ ప్రణాళిక 2025-26 శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించబడినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిక్షణలో మండలంలోని పలు గ్రామాల నుండి ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారని ఈ సందర్భంగా వారికి డిప్యూటీ ఎంపీడీవో వి.వి.ఆర్. కృష్ణంరాజు, టి.ఓ.టి సభ్యులు ఎం. వెంకటలక్ష్మి, ఎల్. త్రిమూర్తులు, డి. కృష్ణమూర్తి తదితరులు శిక్షణను నిర్వహించారని, గ్రామీణాభివృద్ధి పథకాల అమలు విధానం, పంచాయతీల బాధ్యతలు, ఆర్థిక నిర్వహణ, పారదర్శకత వంటి అంశాలపై పాల్గొనేవారికి అవగాహన కల్పించారన్నారు. ఆర్ జి ఎస్ ఏ ప్రణాళిక ద్వారా గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారని, కార్యక్రమం విజయవంతంగా సాగిందని ఎంపీడీవో ఎం. శ్రీనివాసరావు తెలిపారు.

అంగరంగ వైభవంగా

## శ్రీ వాడపల్లి వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాలు

**కళ్యాణోత్సవ కరపత్రాల ఆవిష్కరణ, సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ఉత్సవ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన ఆలయ పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు పాలకమండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ స్వామివారి కల్యాణోత్సవములు ఈనెల 28వ తేదీ తేదీన సాయంత్రం 5 గంటలకు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయని తెలిపారు. ఏప్రిల్ మూడో తేదీ వరకు ఏడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. భక్తుల సౌకర్యాలే ప్రథమ కర్తవ్యంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని భారీ స్థాయిలో కళ్యాణోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు ఎక్కడ ఎటువంటి లోటుపాట్లు లేకుండా, ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసామన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, హెల్త్, ఫైర్, హెడ్ వర్క్స్ తదితర శాఖల అధికారులు ఈ క్రతువులో నిమగ్నులవుతారని తెలిపారు. ఇప్పటికే ఏడు వారాల వెంకన్న, ఏడు శనివారాలు, ఏడు ప్రదక్షిణలు, ఏడేడు జన్మల పుణ్యఫలంగా స్వామివారి ఘనకీర్తి ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తుందన్నారు. ఈ వైభవాన్ని ఇంకా ఇనుమడింప చేయడం కోసం అందరం బాధ్యతగా వ్యవహరిస్తున్నామన్నారు. మన స్వామి వారు, మన వాడపల్లి, మన స్వామివారి కల్యాణోత్సవం అనే భావనతో అందరూ కలిసి ఈ కళ్యాణోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## బిగ్ డిబేట్ :
## విశాఖ ఆర్థిక రాజధాని అవుతుందా..!

దేశానికి ఆర్థిక రాజధాని అనగానే ముంబై పేరు తడుముకోకుండా చెప్పేస్తారు. తెలంగాణకు రాష్ట్ర, ఆర్థిక రాజధాని అనగానే హైదరాబాద్ అన్న విషయంలో ఎవరికీ తేడా లేదు. ఇక, ఏపీ విషయానికి వస్తే.. రాష్ట్ర రాజధానిగా అమరావతి నిర్మాణం జరుగుతోంది. అయితే.. ఇప్పుడు సోషల్ మీడియాలో మరో చర్చ తెరమీదికి వచ్చింది. అదే.. ఆర్థిక రాజధాని!. ఉత్తరాంధ్రలోని విశాఖను ఆర్థిక రాజధాని చేస్తున్నారా? అనేది చర్చ.

దీనిపై అనేక విశ్లేషణలు కూడా వస్తున్నాయి. అంతేకాదు.. అనేక మంది విశాఖ రాష్ట్రానికి ఆర్థిక రాజధాని గా మారుతోందని చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ విషయంపై గుంభనంగా వ్యవహరిస్తోంది. విశాఖ రాష్ట్రానికి ఐటీ రాజధాని అని చెప్పడం ద్వారా.. ఉత్తరాంధ్రకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొంటోంది. కానీ, క్షేత్రస్థాయిలో విశాఖ నుంచి వస్తున్న ఆదాయం.. ప్రభుత్వానికి ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ఇటీవల లెక్కలు ఇదే చెబుతున్నాయి.

ఒకప్పుడు విజయవాడ, గుంటూరుల నుంచి రాష్ట్రానికి ఆదాయం వచ్చేది. దీంతో విజయవాడను వ్యాపార కేంద్రంగా కూడా పేర్కొంటారు. కానీ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో విశాఖ నుంచి పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వానికి పన్నులు, ఇతరత్రా ఆదాయాల రూపంలో సొమ్ము చేరింది. దీనికి తోడు వస్తున్న పరిశ్రమలు.. పెడుతున్న పెట్టుబడులు కూడా విశాఖ... చుట్టే తిరుగుతున్నాయి. విశాఖను ఉత్తరాంధ్రను వేర్వేరుగా చూడలేం కాబట్టి.. ఉత్తరాంధ్ర మొత్తానికి ప్రయోజనం చేకూరితే మంచిదే.

అలా కాకుండా..కేవలం విశాఖను మాత్రమే ప్రాజెక్టు చేసే ప్రయత్నం చేస్తే.. శ్రీకాకుళం, విజయనగరంతో పాటు.. ఇటు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరిలకు ఇబ్బంది తప్పదన్న సూచనలు వస్తున్నాయి. మరోవైపు.. విశాఖకు తాజాగా మిట్టల్ స్టీల్ వచ్చింది. అదేసమయంలో ఇతర ప్రాజెక్టులు కూడా వస్తున్నాయి. ఐటీ కంపెనీలు క్యూ కడుతున్నాయి. ఈ పరిణామాలు గమనిస్తే.. వచ్చే పదేళ్లలో విశాఖ ఆర్థిక రాజధానిగా



ఎదుగుతుందన్న సంకేతాలు వస్తున్నాయి. కానీ.. ఇదేసమయంలో ఇతర ప్రాంతాలను విస్మరించేందుకు అవకాశం ఇవ్వకుండా ముందుకు సాగాల్సిన అవసరం ఉంటుంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్న యువకులకు రిమాండ్

### వచ్చే నెల 6 వరకు విధించిన కోర్టు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక మాధ్యమాల ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులకు కోర్టు వచ్చే నెల 6 వరకు రిమాండ్ విధించింది. విజయవాడకు చెందిన రహంతుల్లా షరీఫ్, మీర్జా సొహైల్ బేగ్, మహ్మద్ డానిష్‌లను సోమవారం నగర పోలీసులు అరెస్టు చేశారు. పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని, వారితో కలిసి సోషల్ మీడియా ద్వారా పలు కార్యకలాపాలు చేపడుతున్న వీరిని కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ఉమ్మడిగా దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. మీ తరఫున వాదించడానికి న్యాయవాది ఉన్నారా అని న్యాయాధికారి ప్రశ్నించగా లేరని వారు సమాధానమిచ్చారు. తమకు న్యాయసహాయం అందించాలని న్యాయమూర్తికి రాతపూర్వకంగా అర్జీ ఇచ్చారు. నిందితులకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులివ్వడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.

## రాకేశ్‌వర్మ టు రోహిత్‌రెడ్డి వయా అభిషేక్‌సింగ్

### ఏజెంట్ల ద్వారా మత్తుపదార్థాలు పంపుతున్న రాకేశ్‌వర్మ - రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో తొలిరోజు కస్టడీ ఆధారాలతో పోలీసుల ప్రశ్నలు - ఎక్కువ ప్రశ్నలకు నిందితుల మౌనం



**మొయినాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** భారాస నేత, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ, కాల్పుల కేసు దర్యాప్తులో నిందితుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. డ్రగ్స్ పెడ్లర్లు, వారి సహాయకులుగా పనిచేసే వారితో నిందితుల్లో కొందరికి నేరుగా సంబంధాలు ఉన్నట్లు బయటపడుతోంది. కేసులో ముగ్గురు ప్రధాన నిందితులైన రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి, దిల్లీ వ్యాపారి నమిత్ శర్మల తొలిరోజు కస్టడీలో పోలీసులు ప్రశ్నలవర్షం కురిపించగా.. ముగ్గురూ నీళ్లు నమిలారు. రాకేశ్‌వర్మతో నిందితుల్లో కొందరు కాల్స్ మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన పెడ్లర్ రాకేశ్‌వర్మ ఆదేశాలతో అభిషేక్‌సింగ్, మరికొందరి నుంచి మత్తు పదార్థాల కొనుగోళ్లు, ఎప్పుడు ఎలా డెలివరీ అయింది.. నగదు బదిలీకి సంబంధించి పక్కా ఆధారాలతో ప్రశ్నించడంతో నిందితులు ఎక్కువసార్లు మౌనంగానే ఉన్నట్లు తెలుస్తోంది. రాకేశ్‌వర్మ నుంచి అభిషేక్‌సింగ్ ద్వారా రోహిత్‌రెడ్డికి చేరినట్లు పోలీసులు అంచనాకొచ్చారు.

**మద్యం మత్తులోనే కాల్పులు**

ఈ కేసులో రిమాండులో ఉన్న ముగ్గురు నిందితుల్ని 72 గంటల కస్టడీకి అనుమతిస్తూ ఉప్పర్‌పల్లి కోర్టు ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. వారిని చంచల్‌గూడ జైలు నుంచి పోలీసులు.. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో శంషాబాద్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. మధ్యాహ్నం భోజన విరామ సమయం మినహా రాత్రి 7 గంటల వరకు విచారించారు. కొద్దిసేపు న్యాయవాదుల సమక్షంలో విచారణ సాగింది. తొలుత ముగ్గురిని వేర్వేరుగా విచారించి సమాధానాలు రాబట్టారు. రోహిత్‌రెడ్డి డ్రగ్స్ పెడ్లర్లతో తనకెలాంటి సంబంధంలేదని చెప్పగా. పోలీసులు వాట్సప్ కాల్స్, నగదు బదిలీలకు సంబంధించి లావాదేవీలను చూపించడంతో ఎలాంటి సమాధానం ఇవ్వలేదని తెలిసింది. తర్వాత ముగ్గుర్నీ కలిపి విచారించారు. మద్యం మత్తులోనే కాల్పులు జరిపానని నమిత్‌శర్మ చెప్పినట్లు తెలుస్తోంది. తాము పోలీసులవైపు కాల్చాలని ఆదేశాలివ్వలేదని, మత్తులో విచక్షణ కోల్పోయి చేశాడని రోహిత్, రితేశ్‌చెప్పినట్లు సమాచారం. మధ్యాహ్నం వరకు సిట్ సభ్యులు యోగేశ్ గౌతమ్, శిరీష ప్రశ్నించగా.. తర్వాత సిట్ పర్యవేక్షకుడు సుధీర్‌బాబు సమక్షంలో విచారణ జరిగింది. ఇతర నిందితులైన బెంగళూరుకు చెందిన న్యాయవాది కౌశిక్‌రవి, వ్యాపారి అర్జున్‌రెడ్డి మరో ఇద్దర్ని పోలీసులు విచారించారు. పరారీలో ఉన్న రాకేశ్‌వర్మ, అభిషేక్‌సింగ్, మరొకరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. విచారణ అనంతరం సిట్ సభ్యులు, అధికారులతో సుధీర్‌బాబు భేటీ అయ్యారు.

## అమ్మపై కోపముంటే.. అంతమొందిస్తావా నాన్నా?

### కుమార్తెకు ఎలుకలమందు తినిపించి చంపిన తండ్రి - తానూ ఆత్మహత్యాయత్నం



**సంస్థాన్‌నారాయణపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముద్దులొలికే చిన్నారి.. కన్నతండ్రి ప్రేమగా పండు చేతికందిస్తే.. ఎప్పట్లాగే మురిపెంగా తినేసింది. కానీ ఆ చిట్టితల్లికేం తెలుసు? అమ్మపై కోపంతో నాన్న ఆ పండులో విషం కలిపాడని! యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చమ్మగూడెం గ్రామానికి చెందిన వరికుప్పల రవికి మూడేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలానికి చెందిన స్వాతితో వివాహమైంది. వీరికి మేఘన (2 ఏళ్లు), మయూరి (9 నెలలు) సంతానం. గొడవలతో మూడు నెలల క్రితం స్వాతి చిన్న కుమార్తెను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. మేఘన తండ్రి వద్దే ఉంటోంది. పెద్ద కుమార్తెనూ తన వద్దకు పంపించాలని స్వాతి పెద్దల సహాయంతో కోరింది. రవి వినకపోవడంతో మాడ్గుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు సంస్థాన్ నారాయణపురం ఠాణాకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో పెద్ద మనుషుల సమక్షంలో సోమవారం మాట్లాడుకోవాలని ఇరువురూ ఓ నిర్ణయానికి వచ్చారు. పరువు పోయిందనే కోపమో.. కుమార్తె దూరం అవుతుందనే బాధనో ఈలోపే మేఘనను కడతేర్చాలనే నిర్ణయానికి వచ్చాడు రవి. శనివారం సపోటా పండులో ఎలుకల మందు కలిపి ఇచ్చాడు. నాన్న పండు తెచ్చాడని సంతోషంతో తిన్న ఆ చిన్నారి వాంతులు చేసుకుంటూ అపస్మారకస్థితిలోకి వెళ్లింది. రవి కూడా నిద్ర మాత్రలతోపాటు ఎలుకలమందు నీళ్లలో కలుపుకొని తాగాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబసభ్యులు గమనించిఅడగగా.. విషయం చెప్పాడు. వెంటనే రవిని నల్గొండ ఆసుపత్రికి, మేఘనను హైదరాబాద్ నిలోఫర్ హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స పొందుతూ చిన్నారి సోమవారం మృతి చెందింది. అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామం లచ్చమ్మగూడెంలో జరిగాయి. స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓర్వకల్లులోని స్టీల్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం



**నంద్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** నంద్యాల జిల్లా ఓర్వకల్లులోని జైరాజ్ స్టీల్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పేలుడు శబ్దం వినిపించడంతో పాటు పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ ఘటనతో ఓర్వకల్లు, గుట్టపాడు పరిసరాల్లో పొగ కమ్ముకుంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలార్పారు. ఇందులో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

### దారుణం.. ప్రియుడితో కలిసి తల్లిని చంపి

## ఇంట్లోనే పూడ్చిపెట్టిన కుమార్తె

**జవహర్‌నగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారానికి అడ్డుపడిందని తల్లిని ప్రియుడి సాయంతో కుమార్తె చంపేసింది. ఈ ఘటన నగరంలోని జవహర్‌నగర్ పరిధి కౌకూర్ భరత్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 10 నెలల క్రితం అంజు అనే మహిళ అదృశ్యమైంది. దీనిపై జవహర్‌నగర్ పీఎస్‌లో పెద్దకుమార్తె ఫిర్యాదు చేసింది. కుటుంబసభ్యుల ఫోన్‌కాల్స్‌ను పోలీసులు విశ్లేషించడంతో పాటు స్థానికులను విచారించారు. ఈ క్రమంలో తల్లిని చంపినట్లు చిన్న కుమార్తె ఇషిక అంగీకరించింది. ప్రియుడు మౌంటీరాజ్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు వెల్లడించింది. ప్రియుడితో సహజీవనంపై తల్లి మందలించడంతో ఆమెను చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టినట్లు తెలిపింది. దీంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తల్లి పేరుతో ఉన్న ద్విచక్రవాహనాన్ని విక్రయించేందుకు ప్రయత్నం చేస్తుండగా ఈ దారుణం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

## ఉగ్ర లింకుల కేసు.. పోలీసుల అదుపులో మహిళ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉగ్ర లింకుల కేసులో విజయవాడ పోలీసులు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడకు చెందిన సయిదా బేగంను కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు విజయవాడకు తీసుకొచ్చారు. రహస్య ప్రదేశంలో ఆమెను విచారిస్తున్నారు. సయిదా బేగం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఉగ్రవాదం వైపు యువత వెళ్లేలా ప్రేరేపిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇటీవల అరెస్టయిన విజయవాడకు చెందిన ముగ్గురు యువకులను ఆ దిశగా మళ్లించడంలో ఆమె కీలకపాత్ర పోషించినట్లు నిర్ధరణకు వచ్చారు. విచారణ అనంతరం సయిదా బేగంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచే అవకాశముంది.

## రాజధానిలో అగ్నిప్రమాదంపై ముమ్మర దర్యాప్తు

### కుట్ర కోణం దిశగా అధికారుల దృష్టి



**తుళ్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతిలో సోమవారం రాత్రి జరిగిన భారీ అగ్ని ప్రమాదంపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. వర్షాలతో చిత్తడిగా ఉన్న ప్రాంతంలో మంటలు చెలరేగడం ఘటనపై అనుమానాలను బలపరుస్తోంది. దీంతో కుట్రకోణంపై దర్యాప్తు సాగుతోంది. ఎస్పీ వకుల్ జిందాల్, ఇంటెలిజెన్స్ ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి అన్నివర్గాలతో చర్చించి వివరాలు సేకరించారు. ప్రమాదాన్ని ముందుగా గుర్తించిన సెక్యూరిటీ గార్డ్ రాముతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. రాయపూడి సమీపంలో ముఖ్య కార్యదర్శుల బంగ్లాలకు వెనుక వైపున మేఘాసంస్థ క్యాంపుసైటును ఏర్పాటుచేసింది. సోమవారం రాత్రి 10.30 సమయంలో పీఎల్‌బీ పైపుల నుంచి మంటరావడం గమనించిన సెక్యూరిటీ సిబ్బంది రాము సైట్ సూపర్‌వైజర్ హనుమంతరావుకు ఫోన్ చేసి తెలిపాడు. చిన్న అగ్నిమాపక పరికరంతో మంటలు ఆర్పటానికి ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో హనుమంతరావు ఫైర్‌స్టేషన్‌కు ఫోన్‌చేశారు. సచివాలయం వద్ద నుంచి ఫైరింజిన్ వచ్చేలోపే దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడ్డాయి. తుళ్లూరు డీఎస్పీ టి.మురళీకృష్ణ, సీఐ కె.శ్రీనివాసరావు ఘటనాస్థలానికి వచ్చి పర్యవేక్షించారు. తర్వాత మంగళగిరి, విజయవాడ, గుంటూరుల నుంచి రెండేసి చొప్పున ఫైరింజిన్లు చేరుకున్నాయి. సుమారు 3 గంటలకు పైగా శ్రమించి పోలీసులు అర్ధరాత్రి 2.05 గంటలకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

**సుమారు రూ. 10 కోట్ల నష్టం**

ఘటనాస్థలంలో 22 లాట్ల పీఎల్‌బీ పైపులు ఉంచగా అందులో 18 లాట్లు ప్రమాదంలో కాలిపోయాయి. ఒక్కో లాట్‌కు 260 పైపులు ఉంటాయని మేఘా జీఎం సురేష్ తెలిపారు. సుమారు రూ.10 కోట్ల పైపులు కాలిపోయాయని మేఘా సంస్థ సిబ్బంది మంగళవారం తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

# గృహ హింసను దాటి.. వైన్ మేకర్‌గా ఎదిగి..

**సక్సెస్ వాయిస్**

తాను పుట్టింది ఆడపిల్లలపై అడుగడుగునా ఆంక్షలున్న కుటుంబంలో.. అది చేయకూడదు, ఇది చేయకూడదు.. వాళ్లతో మాట్లాడకూడదు.. అంటూ హద్దులు పెట్టేవారు. ఇక పెళ్లయ్యాక ఈ కట్టుబాట్లకు గృహ హింస కూడా తోడైంది. ఇలాంటి స్థితిలో ఎవరున్నా 'ఇక నా జీవితం ఇంతే!' అనుకునే వారేమో.. కానీ నమ్రత అలా అనుకోలేదు. ఆ నరకం నుంచి బయటపడి కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకుంది. ఈ ఆలోచనతోనే దేశం కాని దేశంలో అడుగుపెట్టింది. ఈ తెగువే ఇప్పుడామెను పెద్ద వ్యాపారవేత్తను చేసింది. ప్రస్తుతం ప్రపంచ గుర్తింపు పొందిన వైన్ మేకర్‌గా పేరు తెచ్చుకున్న నమ్రత జీవిత కథలో సినిమా స్టోరీని తలపించే మలుపులెన్నో!

**ఆంక్షల మధ్య నలిగిపోయా!**

**నమ్రత పుట్టి పెరిగిందంతా బెంగళూరులో. సంప్రదాయాలు, కుటుంబ విలువలకు అధిక ప్రాధాన్యమిచ్చే ఆమె కుటుంబంలో పురుషాధిపత్యం కూడా ఎక్కువగానే ఉండేదట!**

'మా ఇంట్లో ఏ నిర్ణయమైనా మా నాన్నే తీసుకునే వారు. కనీసం అమ్మ సలహా కూడా అడిగేవారు కాదు. ఆడవాళ్లంటే వంటింటికే పరిమితం అన్నది ఆయన భావన. అంతేకాదు.. ఆడపిల్లలు అది చేయకూడదు, ఇది చేయకూడదు.. అబ్బాయిలతో మాట్లాడకూడదు.. ఒంటరిగా బయటికి వెళ్లకూడదు.. అన్న ఆంక్షలు కూడా మా ఇంట్లో ఉండేవి. ఇలాంటి పరిస్థితుల మధ్య పెరిగిన నాకు ఈ సంకెళ్లు తెంచుకొని స్వేచ్ఛా జీవితం గడపాలనిపించేది. కానీ అంత సాహసం చేయలేకపోయా. హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తిచేశాక నాకు పెళ్లైంది. కనీసం అత్తింట్లోనైనా నేను కోరుకున్న స్వేచ్ఛ దొరుకుతుందేమో అనుకున్నా. అయితే అక్కడ పరిస్థితులు మరింత దారుణం. చీరే కట్టుకోవాలనే వారు.. స్నేహితులను కలవడం, సొంతంగా ఉద్యోగం, వ్యాపారం.. వంటివి చేస్తాననడం.. ఏదో పెద్ద పొరపాటుగా భావించేవారు. వీటికి తోడు భర్త వేధింపులు, గృహ హింసనూ ఎదుర్కొన్నా.. ఈ ప్రతికూల పరిస్థితుల నడుమే నాకు పాప పుట్టింది..' అంటూ ఆనాటి రోజుల్ని గుర్తు చేసుకుంది నమ్రత.

**ఫ్రాన్స్‌లో ఉద్యోగమొచ్చింది!**

**ఎప్పటికైనా ఈ ఆంక్షల సంకెళ్లు తెంచుకొని స్వేచ్ఛా జీవితం గడపాలనుకున్న నమ్రత.. ఈ ఆలోచనతోనే తనకు ఆసక్తి ఉన్న ఫ్రెంచ్ భాష నేర్చుకుంది.**

'నా భర్తకు, అత్తింట్లో వాళ్లకు తెలియకుండా రహస్యంగా ఫ్రెంచ్ భాష నేర్చుకున్నా. నేనున్న గడ్డు పరిస్థితుల్లో ఈ భాషా పరిజ్ఞానమే నాకు అండగా నిలిచింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదే నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ పాజిటివిటీతోనే ఓ ప్రముఖ సంస్థలో ఉద్యోగానికి ప్రయత్నించి సక్సెసయ్యా. అయితే ఉద్యోగం వచ్చింది ఫ్రాన్స్‌లో! దీంతో ఒక్కసారిగా నేను ఎదురుచూస్తున్న స్వేచ్ఛ ఈ రూపంలో వచ్చిందేమో అనిపించింది. అంతే.. అత్తింటి నుంచి బయటికొచ్చేసి, పాపను అమ్మానాన్నల దగ్గర వదిలిపెట్టి.. ట్రైనింగ్ కోసం ప్యారిస్ వెళ్లా. అక్కడున్న నెల రోజులు నాకు నచ్చింది తిన్నా.. నచ్చినట్లుగా ఉన్నా. ఆ తర్వాత తిరిగొచ్చిన నేను ఈసారి నా పాపతో పాటు మా అమ్మను కూడా తోడుగా తీసుకెళ్లా..' అంటోన్న నమ్రత.. వైన్ వ్యాపారంలో స్థిరపడాలన్న ఆలోచనతో ఓవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు 'వైన్ అండ్ స్పిరిట్స్' విభాగంలో ఎంబీఏ పూర్తిచేసింది. ఆపై ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి వ్యాపారంలోకి అడుగుపెట్టింది.


**వైన్ క్వీన్‌గా ఎదిగి..!**

**ఈ క్రమంలోనే 2020లో 'వైన్ ఈక్వేషన్' పేరుతో ఓ సంస్థను ప్రారంభించింది నమ్రత. తొలుత మార్కెట్ నుంచి వైన్‌ను కొనుగోలు చేసి విక్రయించే సేవల్ని కొనసాగించిన ఆమె.. ఆపై కొన్నాళ్లకు 'హాశీశ్రీఅఘుత్‌బం' పేరుతో సొంతంగా వివిధ రకాల వైన్లు తయారుచేసి విక్రయించడం ప్రారంభించింది.**

'ప్రస్తుతం మా బ్రాండ్ పేరుతో వివిధ రకాల పండ్లతో రెడ్, వైట్.. వైన్లు తయారు చేస్తున్నాం. స్టీల్ ట్యాంకుల్లో వారాల తరబడి పులియబెట్టి ప్రత్యేక పద్ధతుల్లో, నాణ్యతా ప్రమాణాల విషయాల్లో ఏమాత్రం రాజీ పడకుండా వీటిని తయారుచేస్తున్నాం'. అంటోందీ వైన్ క్వీన్. ప్రస్తుతం ఫ్రాన్స్ వ్యాప్తంగానే కాదు.. తన వైన్ వ్యాపారాన్ని భారత్, కెనడా, బెల్జియం, మాల్దీవులకూ విస్తరించింది నమ్రత. ఇలా ఓవైపు తన వ్యాపార ప్రయాణాన్ని కొనసాగిస్తూనే.. మరోవైపు వైన్ కన్సల్టెంట్‌గానూ వ్యవహరిస్తోంది. ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లు, సంక్లిష్టతల్ని అధిగమించేలా ఆయా సంస్థలకు తన విలువైన సలహాలు అందిస్తోంది. అంతేకాదు.. తన వ్యక్తిగత, వ్యాపార జీవితాల్లో ఎదురైన సవాళ్లు, అనుభవాల్ని రంగరించి 'వైన్‌యార్డ్ మెలోడీ' పేరుతో ఓ పుస్తకం రాసింది నమ్రత. ఇటీవలే విడుదలైన ఈ పుస్తకం అమెజాన్ బెస్ట్ సెల్లర్స్‌లో ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో తన కూతురితో కలిసి జీవిస్తోందీ వైన్ క్వీన్. తనలా ఆంక్షల చట్రంలో మగ్గిపోకుండా తన కూతురికి స్వేచ్ఛాయుత జీవితాన్నివ్వడంతో పాటు.. తాను కోరుకున్న రంగంలో ప్రోత్సహించడమే తన లక్ష్యమంటోంది నమ్రత.



విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...








## అక్షర యోధులకు

# 'ఆరోగ్య రక్షణ' కవచం!

**నేడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల 'మెగా హెల్త్ క్యాంప్'**
**కలెక్టర్లు షణ్మోహన్ సగిలి, కీర్తి చేకూరిల ప్రత్యేక చొరవ - 60 రకాల ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ**

**రాజమహేంద్రవరం/కాకినాడ, విశ్వం వాయిస్ ప్రతినిధి న్యూస్ :** సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించే జర్నలిస్టుల ఆరోగ్య భద్రతపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. వృత్తిపరమైన ఒత్తిడిలో ఉంటూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న పాత్రికేయుల కోసం నేడు (మార్చి 26, గురువారం) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా భారీ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్లు షణ్మోహన్ సగిలి (కాకినాడ), కీర్తి చేకూరి (తూర్పుగోదావరి) జర్నలిస్టుల సంక్షేమంపై ప్రత్యేక బాధ్యత తీసుకుని ఈ శిబిరాలకు శ్రీకారం చుట్టారు.

**అధికారుల పర్యవేక్షణ.. జర్నలిస్టులకు భరోసా:**
సామాన్యుల సమస్యలను వెలికితీసే 'కలం యోధులు' ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించారు. వైద్య ఆరోగ్య శాఖ, సమాచార పౌర సంబంధ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రేపు ఉదయం 8:00 గంటల నుండే ఈ సేవలు ప్రారంభం కానున్నాయి.

**వేదికలు - వివరాలు: కాకినాడ:** రామారావు పేటలోని రాఘువ 24 Hrs ఎమర్జెన్సీ హాస్పిటల్ (రాజా ట్యాంకు ఎదురుగా).
**రాజమహేంద్రవరం:** ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణ.

**శిబిరం ప్రత్యేకతలు:**
**60 రకాల పరీక్షలు:** బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఎకో, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, LFT, RFT వంటి అత్యాధునిక పరీక్షలు.
**నిపుణుల వైద్యం:** జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, కంటి, దంత వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు.

### కలెక్టర్ల మానవీయ కోణం!
జర్నలిస్టుల కుటుంబాల ఆరోగ్యమే లక్ష్యంగా కలెక్టర్లు షణ్మోహన్ సగిలి, కీర్తి చేకూరి తీసుకున్న ఈ నిర్ణయంపై పాత్రికేయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రత్యేక చికిత్స అవసరమైన వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేసేలా మొబైల్ వైద్య వాహనాలు, పారామెడికల్ సిబ్బందిని కూడా సిద్ధం చేయడం అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనం.

**తేదీ :** మార్చి 26, 2026 (గురువారం).
**సమయం :** ఉదయం 8:00 గంటల నుండి.
**అర్హత :** అక్రిడిటెడ్ జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యులు

**ఉచిత మందులు & అల్పాహారం:** పరీక్షల అనంతరం అవసరమైన మందులు ఉచితంగా అందజేయడంతో పాటు, రాఘవ హాస్పిటల్ సౌజన్యంతో హాజరయ్యే వారికి అల్పాహారం కూడా ఏర్పాటు చేశారు.

**జర్నలిస్టులకు ముఖ్య సూచనలు:**
వైద్య పరీక్షల నిమిత్తం జర్నలిస్టులు ఎటువంటి ఆహారం తీసుకోకుండా ఖాళీ కడుపుతో రావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం అక్రిడిటేషన్ కార్డు మరియు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని సమాచార శాఖ అధికారులు కోరారు.

# వేసవి ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

**శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు చర్యలు : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేద్రంవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వేసవి దృష్ట్యా రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ వినియోగం, అత్యవసర సేవల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయ శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం ఇందుకు సంబంధించి వివిధ శాఖలకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు.

**వైద్య మరియు ఆరోగ్య శాఖ:** వేసవి కాలంలో హీట్ స్ట్రోక్ కేసులు పెరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తగిన ఔషధాలు, ఐవీ ద్రావణాలు, పడకలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉండాలని, గ్రామ స్థాయిలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**గ్రామీణ నీటి సరఫరా మరియు మున్సిపల్ శాఖలు:** ప్రజలకు తాగునీటి కొరత రాకుండా నిరంతర నీటి సరఫరా చేపట్టాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని సూచించారు. పైపులైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని, నీటి నిల్వ ట్యాంకులను శుభ్రపరచాలని ఆదేశించారు.

**విద్యుత్ శాఖ:** వేసవిలో విద్యుత్ వినియోగం అధికమయ్యే నేపథ్యంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, లోపాలు తలెత్తిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

**విద్యాశాఖ:** పాఠశాలల పని వేళలను ఉష్ణోగ్రతల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సర్దుబాటు చేయాలని, విద్యార్థులకు తాగునీరు, నీడ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

**కార్మిక శాఖ:** బయట పనులు చేసే కార్మికులు మధ్యాహ్న వేళల్లో పని చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, యజమానులు తాగునీరు, విశ్రాంతి సమయాలు కల్పించాలని సూచించారు.

**పోలీస్, విపత్తు నిర్వహణ శాఖలు :** అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన ఉండాలని, ప్రధాన కూడళ్లలో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకూడదని, తగినంత నీరు తాగాలని, తేలికపాటి దుస్తులు ధరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తిన పక్షంలో స్థానిక అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం వెనుక బిజెపి కుట్ర

**- ప్రవీణ్ పగడాలది ప్రశ్నించే గుంతని..ఆయన గొంతును నొక్కేశారు**
**- ప్రవీణ్ సంస్మరణ సభలో మాజీ ఎంపీ హర్ష కుమార్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం వెనుక కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర ఉందని మాజీ జీ.వీ హర్షకుమార్ ఆరోపించారు. రాజమండ్రి లూథర్ గిరి గ్రౌండ్స్ లో మంగళవారం ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హర్ష కుమార్‌తో పాటు చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఎలిసా, దళిత సంఘాల ప్రతినిధులు,దైవ సేవకులు భారీగా పాల్గొని ఆయనకు నివాళు లర్పించారు .ప్రవీణ్ పగడాలది ప్రశ్నించే గుంతని... అందుకే ఆయన గొంతును నొక్కేశారని హర్ష కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని ఒక పెద్ద మనిషి ఈ హత్య చేయించారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆ విషయం తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ప్రవీణ్ పగడాల కేసును తప్పుదోవ పట్టించేందుకు హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని హర్ష కుమార్ ధ్వజమెత్తారు. ఏడాది దాటినా ఆయన మరణానికి గల కారణాలు ప్రభుత్వం బహిర్గతం చేయకపోవడం శ్వాచనీయమన్నారు.సీఎం చంద్రబాబు సైతం ప్రవీణ్ పగడాల మద్యం తాగుతూ వచ్చి యాక్సిడెంట్ కు గురయ్యారని వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. చనిపోయిన వ్యక్తి గురించి ఎంత జాగ్రత్తగా మాట్లాడాలో ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. రీ పోస్ట్మార్టం కోసం హైకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నానని.. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం దీనిపై కౌంటర్ దాఖలు చేయడం లేదని దుయ్యపట్టారు. ఈ ప్రభుత్వం దళితులను చిన్నచూపు చూస్తుందని.. ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం యొక్క దుర్మార్గ వైఖరికి వ్యతిరేకంగా పోరాడేందుకు అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని హర్ష కుమార్ పిలుపు నిచ్చారు.

# పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మాధవ్ తీరుపై వ్యతిరేకత

**- రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ వద్ద పూర్వ విద్యార్థులు ఆందోళన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అలుమిని (ఆర్ట్స్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్) అసోసియేషన్ అధ్యక్షుడుగా 2021 నుంచి కొనసాగుతున్న మాధవ్ తీరుపై పూర్వ విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.మంగళవారం ఆర్ట్స్ కాలేజీవద్ద పూర్వ విద్యార్థులు ఆందోళన నిర్వహించి అతని వ్యవహారంపై నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ రెండేళ్లకోసారి జరగాల్సిన అలుమిని అసోసియేషన్ ఎన్నికలు ఐదేళ్లు గడిచిన జరగకుండా అడ్డుకుంటున్నారని,2021 నుంచి ఇప్పటివరకు ఆవ్యక్తి ప్రెసిడెంట్ గానే ఉన్నారని మండిపడ్డారు.ప్రతి స్టూడెంట్ దగ్గర అలోమిని అసోసియేషన్ పేరుతో 200 రూపాయల అక్రమంగా వసూలు చేస్తున్నారని ప్రిన్సిపల్‌ని ప్రశ్నించిన సమాధానం లేదని వాపోయారు. వసూలు చేసిన డబ్బులు అలుమిని అసోసియేషన్ కి ఎలాంటి సంబంధం లేదని ఆర్టీకి లిఖితపూర్వకంగా ప్రిన్సిపల్ సమాధానం చెప్పారని వారు తెలిపారు. టిసీ తీసుకునే విద్యార్థులు ప్రతి ఒక్కరు 200 రూపాయల కట్టాలని ప్రిన్సిపల్ రూమ్ పక్కనే స్కానింగ్ అతికించారని, అక్రమంగా వసూలు చేసిన లక్షల రూపాయలు ఎవరి అకౌంట్లోకి వెళ్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు.ఆర్ట్స్ కాలేజీ లోపల మాధవ్ నిర్వహిస్తున్న క్యాంటీన్లో నాణ్యతలేని ఫుడ్ అందిస్తున్నారని, టెండర్లు లేకుండా అదే క్యాంటీన్ ను కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు.ఆర్ట్స్ కాలేజీ లోపల క్యాంటిన్లో ఉన్న జిరాక్స్ సెంటర్లో ఒక కాపీకి పది రూపాయలు వసూలు చేస్తున్నారని,బయట అదే కాపీ రెండు రూపాయలని, జిరాక్స్ సెంటర్ లో వచ్చే ఆదాయంలో కూడా ప్రిన్సిపల్ కమిషన్ తీసుకుంటున్నారా..? అని వారు ప్రశ్నించారు.తాము ఫిర్యాదు చేస్తే జిల్లా కలెక్టర్ కి కూడా తప్పుడు నివేదిక అందజేశారని పూర్వ విద్యార్థులు మండిపడ్డారు. ప్రశ్నిస్తున్న వారికి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, ప్రభుత్వ అధికారులు ముందుకు వచ్చి ఆర్ట్స్ కాలేజీలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే విద్యార్థులు ఇంకా నష్టపోతారని వారు చెప్పారు.

# దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

**ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు - ఫేక్ ప్రచారంతో దళితులను మభ్యపెట్టే ప్రయత్నాలు ఆపాలి - టీడీపీ నాయకులు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫేక్ ఆడియోలు... వీడియోలపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు వాయిస్ తో అన్నిటా వైరల్ అవుతున్న వాయిస్ ఫేక్ అని, వైకాపా వారు కావాలని ఎడిట్ చేసి సోషల్ మీడియా, ఇతర ప్రచార మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు మజ్జి రాంబాబు, కుదుపూడి సత్తిబాబు, వర్రే శ్రీనివాసరావు, కాశీ నవీన్ కుమార్, మొకమాటి సత్యనారాయణ, బుడ్డిగ రవి, కోరుమిల్లి విజయ శేఖర్, తురకల నిర్మల, కప్పల వెలుగు కుమారి, చాపల చిన్న రాజు, బొర్రా చిన్ని, ఈతలపాటి రవి, బేసరి చిన్ని, సలాది ఆనంద్, రాజ్ కుమార్ తదితరులు జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మజ్జి రాంబాబు మాట్లాడుతూ రాజమండ్రిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు ప్రజలందరికీ తెలిసిన విషయమేనని పేర్కొన్నారు. యువజన రైతు శ్రామిక పార్టీ పేరుతో ఫేక్ వీడియోలు, ఫేక్ ఆడియోలు విడుదల చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల మధ్య విభేదాలు రేకెత్తించే విధంగా కార్యక్రమాలు వైకాపా వారు నిర్వహిస్తున్నారని విమర్శించారు. రాజమండ్రి ఎంపీగా చేసి, చీఫ్ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తులు చిల్లర రాజకీయాలు చేయడం అసభ్యకరమని అన్నారు. ప్రజల్లో సానుభూతి పొందేందుకు ఇటువంటి చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ ప్రాంతాలు గత రెండు ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచాయని, ఆ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.గతంలో భారీ మెజారిటీతో గెలిచిన పార్టీ ఇప్పుడు 11 సీట్లకు ఎలా పడిపోయిందో ప్రజలు గమనిస్తున్నారని, ప్రజల తీర్పు ఎందుకు వచ్చిందో ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 164 సీట్లతో కూటమి ప్రభుత్వం బలంగా కొనసాగుతోందని, రాబోయే కాలంలో కూడా ఇదే విధంగా ప్రజా మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాజమండ్రి నగరంలో అన్ని వర్గాలను ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, ఓసీలు సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. గత 18--20 నెలల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అనేక అభివృద్ధి పనులు చేస్తున్నారని, వాటిని చూసి ఓర్వలేక కొందరు ఇలాంటి రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే విధంగా పనిచేయాలని, ప్రజలకు అండగా ఉండడం నేర్చుకోవాలని సూచించారు. అలా చేస్తేనే వారి పార్టీ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.కప్పల వెలుగు కుమారి, తురకల నిర్మల, మొకమాటి సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల విడుదలవుతున్న ఫేక్ ఆడియోలు, వీడియోలపై చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను కోరినట్టు తెలిపారు. ఇప్పటి వరకు విడుదలైన ఆడిమోలన్నీ కూడా ఫేక్ అని ఇప్పటికే నిరూపితమయ్యాయని వారు పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం వైకాపా కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఫేక్ ఆడియోలు, వీడియోలు తయారు చేసి ప్రచారం చేస్తున్న వైకాపా వారిపై కేసులు నమోదు చేసి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్టు తెలిపారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, కానీ తప్పుడు ప్రచారాలు చేసి వ్యక్తిగతంగా దూషించడం సరైంది కాదని, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలను నిలిపివేయాలని వారు కోరారు.ఎస్సీల అభివృద్ధికి పెద్దపీట వేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమేనని అన్నారు. ఎస్సీలు ఎక్కడా వెనుకబడిపోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని వర్గాల ప్రజలను సమానంగా అభివృద్ధి చేయాలని కృషి చేశారని తెలిపారు. ఎస్సీల ఆర్థికాభివృద్ధి కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వారికి ఆర్థికంగా ఎదగడానికి అవకాశాలు కల్పించిందీ తమ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. దళితులు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు నిజంగా అండగా నిలిచింది కూటమి ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కుటుంబం నుంచి ఎవరైనా పోటీ చేసినా ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారని, పేదవాళ్లకు, ఎస్సీలకు ఏ కష్టం వచ్చినా ముందుగా ఆదిరెడ్డి కుటుంబమే అండగా నిలుస్తుందని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీల అభివృద్ధికి పెద్దపీట వేసారని, విద్యుత్, దీపం పథకం, మహిళల కోసం డ్వాక్రా సంఘాలు వంటి అనేక కార్యక్రమాలు తీసుకువచ్చి పేదల జీవనోపాధిని మెరుగుపరిచారని అన్నారు. ఆయన వేసిన అభివృద్ధి విత్తనం ఈరోజు పెద్ద వృక్షంగా మారిందని వ్యాఖ్యానించారు. రాజమండ్రి అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ నాయకత్వమే ప్రధాన కారణమని, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే భవాని, మాజీ మేయర్ వీర రఘువమ్మ, యువ నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ కలిసి నగర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.ఇటీవల కొందరు ఫేక్ న్యూస్‌లు, ఫేక్ ఆడియోలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు నిలిపివేయాలని, దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు.

# ఆదిత్య రమాదేవికు డాక్టరేట్ బహుకరణ

**రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అందజేత**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు లెక్చరర్ డా.బి హెచ్. వి. రమా దేవికి నేడు ఆంధ్ర విశ్వ కళా పరిదత్ 91వ, 92వ ఆంధ్రా యూనివర్సిటీ స్నాత కోత్సవంలో మార్చి 25న గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అవార్డును అందుకున్నారు మహాకవి దుర్గానంద్ సమగ్ర సాహిత్యము ఒక పరిశీలన అనే అంశంపై ఆమె సిద్ధాంత గ్రంథాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సమర్పించారు. 2022లోనే డాక్టరేట్ పొందినప్పటికినీ, స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా తీసుకోవాలని ఆకాంక్షతో నేడు పి.హెచ్.డి. పట్టాను తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ ఉమాదేవికి పరిశోధన అంటే చాలా ఇష్టమని,ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుండి ఎంసీలు పట్టాను పొందారని,52 పైచిలుకు సెమినార్ పత్రాలను వివిధ అంశాల్లో సమర్పించి కళాశాలకు ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చారని తెలియజేశారు.నేడు గవర్నర్ చేతుల మీదుగా పి హెచ్.డి. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తులో స్నాతకు ఉత్సవంలో అందుకోవటం ఆదిత్య విద్యాసంస్థలకు గర్వకారణమని ఆయన చెప్పారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, అదిత్య విద్యాసంస్థల , డైరెక్టర్ ఎన్.సుగుణా రెడ్డి, కోఆర్డినేటర్ బి.ఇ..వివిల్. నాయుడు, ప్రిన్సిపాల్స్, సిహెచ్ ఫణికుమార్, ఎస్ కె ఎన్ రెహమాన్ లు,ఆదిత్య ఎన్ఎస్ఎస్ డాక్టర్ జివిఎస్ నాగేశ్వరరావు, అధ్యాపకు అధ్యాపకేతర సిబ్బంది తమ అభినందనలు తెలియజేశారు.తన కుటుంబంతో పాటు, ఆదిత్య కుటుంబపు సహాయ సహకారాలు మరువలేనని, తనకు డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ఆదిత్య చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అత్యంత సహాయ సహకారంతోనే సాధ్యమయిందని, రమాదేవి సందర్భంగా చెప్పారు. రమాదేవికి కళాజ్యోతి మీ వ్యవస్థాపకులు డాక్టర్ బివిఎస్ మూర్తి, అధ్యక్షులు పీవీబీ సంజీవరావు తమ అభినందనలు తెలియజేశారు.

# దొమ్మేటి వెంకటరెడ్డి గొప్ప సంఘ సంస్కర్త

## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ - ఘనంగా సత్కరించిన శెట్టిబలిజ సంఘీయులు



**తాళ్ళరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** శెట్టిబలిజ జాతి పితామహుడు స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి ప్రముఖ సంఘ సంస్కర్త అని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్ళరేవు మండలంలో శెట్టి బలిజ జాతిపిత స్వర్గీయ దొమ్మేటి వెంకట రెడ్డి గారి జయంతోత్సవ కార్యక్రమం తాళ్ళరేవు మండల తెలుగు దేశం పార్టీ శెట్టి బలిజ ప్రజాప్రతినిధులు, నాయకులు స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి వాసంశెట్టి సుభాష్, ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి లు హాజరై ఏర్పాటు చేసిన స్వర్గీయ దొమ్మేటి వెంకట రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక సంఘీయులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి రాష్ట్ర వేడుకగా నిర్వహించేందుకు కృషి చేసిన మంత్రి సుభాష్ ను ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ దొమ్మేటి వెంకట రెడ్డి జీవిత చరిత్రను గుర్తించి కూటమి ప్రభుత్వం జీఓ నెంబర్ 629 విడుదలచేసి ఆయన జయంతి రాష్ట్ర పండుగలా నిర్వహించటంపై హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు జార్జిపేట గ్రామం రెడ్డి వారి పేటలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయంను సందర్శించి స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం తాళ్ళరేవు గ్రామం కేశవపురంలో నూతన రామాలయ ప్రతిష్ట మహోత్సవంలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. ఆయా ఆలయాల నిర్మాణ కమిటీ సభ్యులు పండితులచే పూర్ణ కుంభం తో ఘనస్వాగతం పలికి సత్కారించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కట్టా త్రిమూర్తులు, పిల్లి సత్తిబాబు, పితాని విష్ణు, వాడ్రేవు వీరబాబు, గంజా సూరిబాబు, గుత్తుల సూర్య నారాయణ, పొన్నమండ రామలక్ష్మి, మేడిశెట్టి సత్తిబాబు, జక్కల ప్రసాద్ బాబు, రోళ్ళ చక్రవర్తి, ఉంగరాల బూరిబాబు,కొప్పిశెట్టి చంటి, పెంకే ఏడుకొండలు,చోడి నరసింహ మూర్తి, రెడ్డి నాగు, కదలి సింహాద్రి, కదలి శ్రీ నివాస్, విత్తనాల కర్మిలస్వామి, సూరంపూడి కుమార్, యనమండ్ర విజయ్ కుమార్, సుందపల్లి సత్యనారాయణ,పితాని హేమలత, చంద్రాల బుజ్జి చౌదరి, టేకుమూడి సత్యనారాయణ, పిల్లి మహేష్, వాసంశెట్టి గోవిందు, పెన్నాడ వేణు, ఉమామహేశ్వరి, సత్యవేణి, దంగేటి అవినాష్, గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణే లక్ష్యం

### జిల్లా పోలీస్ సమీక్షా సమావేశంలో ఎస్పీ రాహుల్ మీనా



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా స్థాయి నెలవారీ నేర సమీక్షా సమావేశం ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఏలూరు పరిధి ఐజీ జి.వి.జి.అశోక్ కుమార్ ఆన్‌లైన్ ద్వారా హాజరై అధికారులకు తగు సూచనలు చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పాత నేరస్థులు, రౌడీ షీటర్లపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల్లో భయం సృష్టించే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచి, అవసరమైన చోట నిర్బంధ చట్టం (పీడీ చట్టం) అమలు చేయడంతో పాటు జిల్లా బహిష్కరణ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 14న నిర్వహించనున్న డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేసి, సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందే వదంతులపై నిఘా ఉంచాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న విచారణలో ఉన్న కేసులు, ముఖ్యంగా తీవ్రమైన నేరాలు, గల్లంతు కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. నేర, నేరస్థుల గుర్తింపు నెట్‌వర్క్ వ్యవస్థ (సీసీటీఎన్ఎస్) నవీకరణ, '112' అత్యవసర సేవల స్పందన సమయం, ఈ-సాక్ష్య వ్యవస్థ పనితీరు, డ్రోన్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాత నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, అవసరమైన సందర్భాల్లో నిర్బంధ చట్టం, బహిష్కరణ వంటి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై విశ్లేషణ జరిపి, ప్రమాద ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలను తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణ స్పందనతో నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఏ.వి.ఆర్.పి.బి.ప్రసాద్, అమలాపురం డిఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, కొత్తపేట డిఎస్పీ శ్రీ మురళి మోహన్ , ఏఆర్ డిఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సిఐ పుల్లారావు, డీసీఆర్‌బీ సిఐ నాగ ప్రసాద్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఉచిత పశు వైద్య శిబిరం క్యాంపు

**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నేడు ఉదయం 10 గంటలకు అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ, పశు సంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ముక్కామల గ్రామంలోని వెటర్నరీ ఆసుపత్రి వద్ద ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించబడునని పశువైద్య అధికారులు తెలిపారు. ఈ శిబిరాన్ని కూటమి శాసన సభ్యులు గిడ్డి సత్యనారాయణ ప్రారంభించనున్నారని అన్నారు. ఈ పశువైద్య శిబిరాన్ని పాడి రైతులు, ఆవులు, గేదెలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## సుపరిపాలన వలననే, అభివృద్ధి, సమస్యలు పరిష్కారం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సుపరిపాలన కారణంగా గ్రామాల్లో పలు సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. కొత్తపేట గ్రామ తెలుగుదేశం పార్టీ కొత్తపేటలో అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేపడుతున్న చర్యలు ప్రశంసనీయం కొత్తపేట గ్రామ తెలుగుదేశం పార్టీ సమావేశం గ్రామ పార్టీ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో జరిగింది ఈ సందర్భంగా సమావేశం పలు తీర్మానాలు చేసింది గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మార్చి 29 పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని.సీనియర్ నేతలను సత్కరించుకోవాలని మార్చి 31 వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం సందర్భంగా అధిక సంఖ్యలో జనం రావులపాలెం తరలి వెళ్లాలని సమావేశం తీర్మానించింది కొత్తపేట పంచాయతీ సర్పంచ్, పాలకవర్గం గ్రామంలో చేసిన పాలన,అభివృద్ధిని సమావేశం కొనియాడింది. సమావేశంలో పార్టీ బూత్ కన్వీనర్లు,యూనిట్ ఇన్చార్జిలు, వివిధ హోదాలో ఉన్న పార్టీ నేతలు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాలు మేరకు నియోజవర్గం వ్యాప్తంగా రైతన్నామీకోసం కార్యక్రమాల్లో నిర్వహించారు. కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు గనిశెట్టి వీరేష్, రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి ప్రసాద్, ఆత్రేయపురం మండలం పులిదిండి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు కుసంపూడి రామకృష్ణంరాజు (బాబు), ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సమగ్ర ప్రోత్సాహం అందించేందుకు కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని ప్రతి మండలంలో నిర్వహించి అన్నదాతలకు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ విధానాలు, పంటల ఎంపిక, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలిపేందుకు వ్యవసాయం మరియు అనుబంధ రంగాల్లో వార్షికంగా కనీసం 15 శాతం వృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రైతును ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఐదు దశల్లో కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వివరించారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదుపై

## ప్రజలకు అవగాహన కల్పించి సభ్యత్వ నమోదు కార్యక్రమం



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం మండల అధ్యక్షులు మోకా బాల ప్రసాద్ అధ్యక్షతన త్రీ మ్యాన్ కమిటీ సభ్యులు కలవ కొలను తాతాజీ , వాసంశెట్టి కుమార్, ఆకుల ప్రవీణ్ మరియు ముమ్మిడివరం ఏఎంసి చైర్మన్ ఓగురి భాగ్యశ్రీ గార్ల, ఆధ్వర్యంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించి సభ్యత్వ నమోదు ఇంటింటికి వెళ్లి వారిచే జనసేన పార్టీ సభ్యత్వం చేయించడం జరిగింది. బలుసుతిప్ప, బూలవారి పేట, మరియు కుండలేశ్వరం గ్రామం, కాపులపాలెం, గచ్చకాయలపోర, జనసేన పార్టీ సభ్యత్వం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం జనసేన పార్టీ సీనియర్ నాయకులు గుద్దటి జమ్మి, ముమ్మిడివరం హాస్పిటల్ డైరెక్టర్ బద్రి రమా, జనసేన ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోర్డినేటర్ శ్రీమతి ముత్యాల జయ లక్ష్మి, ఉప్పుడి సర్పంచ్ రాంబాల రమేష్, సీనియర్ నాయకులు నూకల దుర్గబాబు, గాలిదేవరా మూర్తి, నియోజకవర్గం మండల అధ్యక్షులు దూడల స్వామి నాయుడు, ఎం.పురుషోత్తం, సీనియర్ నాయకులు గుద్దటి విజయ్, అంగాని నరసింహమూర్తి, రంబాల చౌదరి బాబు, గిడ్డి రత్నశ్రీ, భీమల సూరినాయుడు, మగాపు పట్టాభి, బల్ల కుమార్, సలాది శ్రీరామ్, అమర సాయి, అజయ్, ఓలేటి శ్రీను, పెమ్మడి శ్రీను, పెమ్మడి ఆదినారాయణ, రాగుర్తి యేసోబ్, జనసేన నాయుకులు వీర మహిళలు పాల్గొన్నారు.

## జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

### వదంతులు నమ్మొద్దని అధికారుల సూచన



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

రాష్ట్రవ్యాప్తంగా అలాగే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఎక్కడా కూడా పెట్రోల్, డీజిల్ కొరత లేదని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ తెలిపారు. గతంలో ఉన్న వినియోగ స్థాయికి అనుగుణంగానే ప్రస్తుతం కూడా పెట్రోల్, డీజిల్ సరఫరాలు కొనసాగుతున్నాయని, బంకులకు అవసరమైన స్టాకులు సమృద్ధిగా అందుతున్నాయని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న అసత్య వార్తలను నమ్మి ప్రజలు ఆందోళనకు గురికావద్దని సూచించారు. భయాందోళనలకు లోనై అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటీవల కొంతమంది పెద్ద క్యాన్లు, బాటిల్స్ తీసుకుని బంకులకు వచ్చి పెట్రోల్ నింపాలని కోరుతున్నారని తెలిపారు. అయితే నిబంధనల ప్రకారం ఆ విధంగా బల్క్ పాత్రల్లో ఇంధనం పోయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్‌ను నేరుగా వాహనాల్లోనే నింపాలని సూచించారు. వినియోగదారులు ఎవరూ కూడా ఆందోళన చెందకుండా, వ్యవస్థను అస్తవ్యస్తం చేసే చర్యలకు పాల్పడవద్దని కోరారు. అదే విధంగా బంకు యజమానులు కూడా ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, బల్క్ పాత్రల్లో ఇంధనం నింపడం పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన బంకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉప్పలగుప్తంలో వైభవంగా

## ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారం

### ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే ఆనందరావు



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ఉప్పలగుప్తంలో నిర్వహించిన ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకురాలు చిక్కం సుధ ఆత్మ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయగా, ఆమెతో పాటు 30 మంది డైరెక్టర్లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేన కార్యకర్తల కృషికి గుర్తింపుగా ఈ పదవులు కేటాయించినట్లు తెలిపారు. ఆత్మ కమిటీ రైతులకు ఆధునిక సాంకేతికతను చేరవేసే కీలక వేదికగా నిలవాలని, వ్యవసాయం, హార్టికల్చర్, పశుసంవర్ధక రంగాల్లో వినూత్న పద్ధతులను పరిచయం చేయాల్సిన బాధ్యత కమిటీపై ఉందన్నారు. గతంలో ఈ పదవులు నామమాత్రంగా ఉన్నాయని, ప్రస్తుతం ఏర్పడిన కొత్త కమిటీ క్షేత్రస్థాయిలో పనిచేసి రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కమిటీ కార్యకలాపాలకు శాసనసభ్యుడిగా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర పరిస్థితులపై మాట్లాడిన ఆయన, గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం భారీ అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. ప్రస్తుత నాయకత్వం కృషితో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ దిశగా ముందుకు సాగుతోందన్నారు. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులు పూర్తవ్వాలంటే స్థిరమైన పాలన అవసరమని అభిప్రాయపడ్డారు.

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 27 రోజుల

## హుండీ ఆదాయం 1.82 కోట్లు



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కొనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం గణనీయంగా నమోదైందని ఆలయ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ రాజు)ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి నల్లం సూర్య చక్రధర్ రావు లు తెలిపారు బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో మొత్తం రూ.1.82 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.ఆలయ ప్రధాన హుండీతో పాటు శ్రీ విశ్వేశ్వర స్వామి హుండీల నుండి రూ.1,47,36,474 నగదు లభించగా, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.35,57,814 వచ్చినట్లు వెల్లడించారు. మొత్తం 27 రోజుల వ్యవధికి గాను రూ.1,82,94,288 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. భక్తులు సమర్పించిన బంగారం 19 గ్రాములు, వెండి 860 గ్రాములు లభించాయి. అదనంగా 12 దేశాలకు చెందిన 51 విదేశీ కరెన్సీ నోట్లు కూడా హుండీల్లో లభించాయి. లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్తలు టి.సాయి ప్రసాద్, పి.భవాని, సి.హెచ్. సత్యనారాయణ, ఎస్. సూర్య కుటుంబరావు పాల్గొన్నారు. పర్యవేక్షణను అసిస్టెంట్ కమిషనర్ & జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సత్యనారాయణ, ఎస్.టి.పి.టి. శ్రీనివాస్ నిర్వహించారు. ఈఓలు పి.వి.వి.ఎస్. కామేశ్వరరావు, బి.కిరణ్ హాజరయ్యారు. అర్చకులు, వేదపండితులు, గ్రామస్థులు, పోలీసులు, శ్రీవారి సేవకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. రావులపాలెంలోని కరూర్ వైశ్య బ్యాంక్, కెనరా బ్యాంక్ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

## రూ.47 లక్షలతో నూతన జెసిబి

### జెసిబి ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామ చంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో రూ. 47 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన నూతన జెసిబి వాహనాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణల తొలగింపు, డ్రైనేజ్ శుభ్రపరిచే పనులు, ఇతర శానిటేషన్ పనులకు ఈ జెసిబి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం సాధారణ నిధులు మరియు 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ జెసిబి కొనుగోలు చేసినట్లు మున్సిపాలిటీ డీఈ శ్రీకాంత్ మంత్రికి వివరించారు. ఇంతకు ముందు జెసిబి లేక అద్దె ప్రాతిపదికన తెచ్చుకునేవాళ్లమని, ఇప్పుడు మున్సిపాలిటీకి సొంతంగా జెసిబి ఉండటం వల్ల ఖర్చులు తగ్గి మున్సిపాలిటీ నిధులకు ఆదా కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ. 250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న పుష్కరాల సందర్భంగా మరో రూ. 120 కోట్లు మంజూరు అవుతాయని వెల్లడించారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం మరియు పట్టణ అభివృద్ధి పనులకు ఈ జెసిబి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, గరికపాటి సూర్యనారాయణ, ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, కడియాల రాఘవన్, కవల నానాజీ, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, మేడిశెట్టి సూర్యనారాయణ, దిగుమర్తి వీరబాబు, జాస్తి విజయలక్ష్మి,మాజీ కౌన్సిలర్ కేతా సుజాత, దోమ్మలపాటి విజయలక్ష్మి, మున్సిపల్ ఏఈలు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు బాధితులకు మంత్రి సుభాష్ రూ.25 వేల ఆర్థిక సహాయం

### అనారోగ్య, ప్రమాద బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పిన మంత్రి



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో అనారోగ్య, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ. 25,000 ఆర్థిక సహాయం అందించి పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెప్పి సామాజిక బాధ్యతగా తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. కె గంగవరం మండలం బాలాంత్రం గ్రామానికి చెందిన కోట వెంకటేశ్వరరావుకు వైద్యులు ఆపరేషన్ చేసి కాలు తొలగించిన విషయం తెలుసుకున్న మంత్రి ఆయనను పరామర్శించి రూ. 15,000 ఆర్థిక సహాయం అందించారు. అదే గ్రామానికి చెందిన దార్ల విజయ్ ప్రమాదవశాత్తు బైక్ పై నుండి పడిపోవడంతో గాయపడగా ఆయనకు రూ. 5,000 ఆర్థిక సహాయం అందించారు. అలాగే రౌతు సూర్యనారాయణకు చేతికి ఆపరేషన్ జరగడంతో మందులు మరియు వైద్య ఖర్చుల నిమిత్తం మరో రూ. 5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ విధంగా ముగ్గురికి మొత్తం రూ. 25,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి బుజ్జి, మల్లిపూడి మోహన్ రావు, గ్రామ టిడిపి అధ్యక్షులు మల్లిపూడి సూర్యచంద్రరావు, కార్యదర్శి బొమ్ము వెంకట్రావు, తోలేటి కృష్ణ, ఈరెళ్ళ రాజు తదితరులు పాల్గొన్నారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవడం తన బాధ్యతగా భావిస్తానని, అవసరమైన వారికి ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.

## అవార్డు గ్రహీత అంజికి అభినందన సత్కారం



**కాట్రేనికోన విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధానిలో ఇటీవల జరిగిన ఉగాది పురస్కారాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా చిత్రకళ సేవలో ప్రతిభ కనబరిచి కళా రత్న పురస్కారాన్ని అందుకున్న గ్రామానికి చెందిన అంజి ఆకొండి ని గ్రామ సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ ఆధ్వర్యంలో పంచాయితీ ఆవరణలో అభినందన సత్కార సభ ఏర్పాటు చేసి ఘనంగా అంజని సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అంజి చిన్ననాటి నుండి చిత్రకళే శ్వాసగా కొనసాగుతూ కళల కాణాచి కోనసీమ నుండి అమరావతి స్థాయికి మన గ్రామానికి గుర్తింపు తేవడం మనందరికీ ఘనతేనని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పలువురు వక్తలు పాల్గొని అంజి గురించి మాట్లాడి, దుస్సాలువలతో పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లా నరసింహ మూర్తి, శీలం సూర్యనారాయణ, వెంట్రు సుధీర్ తటపర్తి వెంకటరత్నం, వాసంశెట్టి రాజేశ్వరరావు, పిల్లి ప్రసాద్, వాసంశెట్టి శ్రీను, సానబోయిన నాగేశ్వరరావు, మధుబాబు, ఆకొండి గోపాలకృష్ణ, పెద్దింటి తంబి, కిరణ్, కృష్ణ, ఆణివిళ్ళ పవన్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## పటిష్ట భద్రత నడుమ ఈవీఎం, వీవీప్యాట్ గోదాములు

### నిరంతర పర్యవేక్షణ కొనసాగాలి : జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ముమ్మిడివరం ప్రాంతంలోని ఎయిమ్స్ కళాశాల మూడో అంతస్తులో భద్రపరిచిన ఈవీఎం, వీవీప్యాట్ గోదాములకు పకడ్బందీ భద్రత కల్పించినప్పటికీ, నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం ఆమె ఈవీఎం, వీవీప్యాట్ గోదాములను తనిఖీ చేసి, భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఈ తనిఖీలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల సిబ్బంది, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, విద్యుత్ భద్రత వంటి అంశాలను ఆమె పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాల ప్రకారం ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదాములను క్రమం తప్పకుండా తనిఖీ చేసి సమగ్ర నివేదికలను అందిస్తున్నామని తెలిపారు. అలాగే, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి (త్రైమాసికంగా) తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, సీసీ కెమెరాల పర్యవేక్షణతో కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని సూచించారు. ఈవీఎం భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో జిల్లా జాయింట్ కలెక్టర్‌తో పాటు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున వడ్డీ నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ తరఫున డి.రమణ కుమార్, ఉప తహసీల్దార్ శివరాజ్, సిబ్బంది బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## విదేశంలో చిక్కుకున్న మహిళకు జిల్లా యంత్రాంగం సహాయం



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

మస్కట్ దేశంలో మెడికల్ పరీక్షలో అనర్హురాలిగా తేలి తీవ్ర ఆందోళనకు గురైన అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన జె.పార్వతి, జిల్లా కలెక్టర్ డా.మహేష్ కుమార్ రావిరాల చొరవతో సురక్షితంగా భారతదేశానికి చేరుకున్నారు. జె.లోవ రాజు వ్యవసాయ కూలిగా జీవిస్తూ కుటుంబ పోషణ కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో తన భార్య పార్వతిని ఉపాధి నిమిత్తం ఒక ఏజెంట్ ద్వారా మస్కట్‌కు పంపించారు. అక్కడ గృహ సహాయకురాలిగా పని కల్పించినప్పటికీ, స్థానిక నిబంధనల ప్రకారం నిర్వహించిన వైద్య పరీక్షలో ఆమె అనర్హురాలిగా తేలడంతో ఉద్యోగానికి అనర్హురాలైంది. దీంతో యజమాని ఆమెను సంబంధిత కార్యాలయానికి అప్పగించగా, పార్వతి తీవ్ర ఆందోళనకు గురై ఆరోగ్యం క్షీణించింది. ఏజెంట్‌ను సంప్రదించినప్పటికీ సరైన సహాయం అందకపోవడంతో ఇబ్బందులు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో పరిచయస్తుల సూచన మేరకు అమలాపురంలోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ (కెసిఎమ్)ను ఆశ్రయించారు. కేసీఎం అధికారులు సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత ఏజెంట్లతో సమన్వయం చేసి పార్వతిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో విజయవంతమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్, కేంద్ర నోడల్ అధికారి టి.నిశాంతి, సమన్వయకర్త గోళ్ళ రమేష్ మాట్లాడుతూ, విదేశాలకు వెళ్లే వారు పూర్తి అవగాహనతో వెళ్లాలని సూచించారు. లేకపోతే తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని తెలిపారు. వలసదారులకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అందరూ ఈ సేవలను వినియోగించుకుని భద్రమైన వలస సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడియాల సత్తిబాబు, షేక్ బీబి సఫియా తదితరులు పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ
జిల్లా ఎడిషన్
గురువారం, 26 మార్చి 2026
www.viswamvoice.com



# సర్పంచుల అధికారాలకు (చెక్ పవర్‌కు) చెక్...!

## చెల్లింపు లావాదేవీలు నిలుపుదల - అత్యవసరమైతే డిడిఓ అనుమతి తీసుకోవాలి - సిద్ధమవుతున్న ప్రత్యేక అధికారుల జాబితా



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 1 ఏప్రిల్ 2021న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పదవీ బాధ్యతలను చేపట్టిన పంచాయతీ సర్పంచుల అధికారిక పదవీ కాలం ఇంకో వారం రోజుల్లో అధికారికంగా పూర్తి కాబోతోంది. ఏప్రిల్ 2తో వీరి పదవీ కాలం ముగుసి పోతుంది. దీంతో ఈ వారం రోజుల వ్యవధి లోపుగా కొందరు సర్పంచులు పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసే అవకాశం లేక పోలేదనే ముందు చూపుతో సర్పంచుల అధికారాలకు, చెక్ పవర్ కు వారం రోజులు ముందుగానే ప్రభుత్వం చెక్ పెట్టేసింది. బుధవారం నుంచి సర్పంచులు నేరుగా చెల్లింపులు చేయడానికి అవకాశం లేదు. జీతాలు వంటి అత్యవసర చెల్లింపులు చేయాల్సి వస్తే గనుక ప్రస్తుతం డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ (డిడిఓ) మాత్రమే ఆమోదించాలి. సిఎఫ్ఎమ్ఎస్ ద్వారా బిల్లులకు సర్పంచులు వేలి ముద్రలను వేస్తే గడచిన మంగళవారం వరకూ నేరుగా ప్రభుత్వ ధనాగారానికి వెళ్లేది. కాని ఇప్పుడు డిడివొ లాగిన్ కు వెళుతోంది. డిడివో ఆయా ఖర్చులను పరిశీలించి తన వేలి ముద్రను వేస్తేనే కాని ఇప్పుడు ప్రభుత్వ కోశాగారానికి వెళ్ళదు. అంతేగాక బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ వీడియో కాన్ఫరెన్స్ లో అందరూ జిల్లా పంచాయతీ అధికారులకు (డిపివొ) చెల్లింపులపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడైనా పంచాయతీ కార్యదర్శులు సర్పంచులతో కుమ్మక్కై నిధులు తీసుకునే ప్రయత్నం చేస్తే గనుక కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో కూడా సర్పంచులకు రెండు మూడు నెలల పదవీకాలం ఉండగానే వారి చెక్ పవర్ రద్దు చేసి చెక్ బుక్ లను అధికారులు స్వాధీనం చేసుకునేవారు. ఇప్పుడు చెక్ లతో పని లేకుండా నేరుగా సిఎఫ్ఎమ్ఎస్ ద్వారా విధులు ఖర్చు చేసుకునే విధానపై ఈ ఆంక్షలను విధించారు.

**సిద్ధమవుతున్న ప్రత్యేక అధికారుల జాబితా...**

వచ్చే నెల మూడు నుంచి సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకునేందుకు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. బుధవారం సాయంత్రానికి మండలాల వారీగా ప్రత్యేక అధికారులను ఎవరు నియమించాలనే దానిపై జాబితాను సిద్ధం చేసి ఆయా జిల్లాల కలెక్టర్లకు అందించాల్సి ఉంది. అందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రత్యేకత అధికారులుగా మండల స్థాయిలో తాసిల్దార్, ఎంపీడీవో, ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు, ఇద్దరు ఎంఈఓ లు, మండల వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ, మండల పరిషత్తు పరిపాలనా అధికారి వంటి వారిని నియమిస్తారు. మండల స్థాయిలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఉన్నప్పటికీ వారిని ప్రత్యేక అధికారులుగా నియమించడానికి నిబంధనలు వర్తించవు. ఎందుకంటే వారే పనులకు సంబంధించి ఎంబుక్ చెక్ మెజర్మెంట్ చేస్తారు. అందువల్ల వాళ్లకే నిధులు ఖర్చు పెట్టే అవకాశం ఉండదు. కొన్ని మండలాల్లో ఎక్కువ గ్రామ పంచాయతీలు ఉండటం వల్ల రెండు, మూడు పంచాయతీలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించే అవకాశాలు ఉన్నాయి. అయితే తాసిల్దార్, మండల విద్యాశాఖ వంటి అధికారులు బిల్లులు చెల్లింపులో మరింత లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకోవటంతో పాటు గ్రామ పంచాయతీ వ్యవస్థపై తగినంత అవగాహన లేక పోవడం వల్ల వారిని ప్రత్యేక అధికారులుగా నియమించు కోవడానికి చాలా మంది ఉత్సాహం చూపడం లేదని సమాచారం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,069 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాల విభజన అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 342 గ్రామ పంచాయతీలు, కాకినాడ జిల్లాలో 385, తూర్పుగోదావరి జిల్లాలో 342 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ అన్ని గ్రామాల పంచాయతీలకూ సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారులు నియామకం కానున్నారు.

# పారేపల్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన ముద్రగడ



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం నగర పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు బుధవారం పర్యటించారు.పట్టణంలోని 7వ వార్డుకు చెందిన పారేపల్లి వీరభద్రరావు ఇటీవల మృతి చెందగా ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు వీరభద్రరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఇలాంటి సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సామంతుల సూర్యకుమార్, వాగు బలరాం, పైల విజయ్, ముద్రగడ వీరేంద్ర, కోరాడ ప్రసాద్, సుంకర రాంబాబు, గోళ్ళ నాగేశ్వరరావు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి : చిలుకూరి రామ్‌కుమార్



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం సిరిపురం చిద్గగనానంద గీతాశ్రమంలో 52వ భక్తి, జ్ఞాన వేదాంత మహా సభలు గంగచోల్లపెంట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ యోగానంద భారతీ స్వామి అధ్యక్షన నిర్వాహకులు సాధు మహేష్ వారెన్య వారు ఆధ్వర్యం లో ఈ నెల 23 నుండి 25 వరకు జరిగే మూడు రోజుల సభలకు ఈరోజు ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా పూర్వ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ పాల్గొని ఆశ్రమ వ్యవస్థాపకులు బ్రహ్మలీన అచ్యుతానంద భారతీ స్వామి విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మానవులు అజ్ఞానాన్ని వీడనాడి భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతో ఉండాలని,ధ్యానంతో మనసు ప్రశాంతతను పొందవచ్చన్నారు.ఆధ్యాత్మిక సభలతో మహాత్ముల ప్రవచనాలు ద్వారా భక్తులు సన్మార్గం లో నడవ వచ్చని తెలిపారు. ఆశ్రమ అభివృద్ధికి సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వామీజీలు లక్ష్మణ నంద స్వామి, యోగ గురువు సత్యనారాయణ, గునిమాని కులు వెంకట రమణ, పెట్రూం శివ, దయానంద భారతి స్వామి, నడిశెట్టి తిరుపతిరావు, యల్లపు సూర్యనారాయణ, మజ్జూరి వెంకట లక్ష్మి, మజ్జూరి వెంకటేశ్వర్లు,కొల్లా శ్రీనివాస్,సింగిలిదేవి సత్తిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వంట గ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టండి

### - గొట్టిముక్కల, ధర్నాలకోట



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు నేపథ్యంలో రాష్ట్రంలో వంట గ్యాస్ కొరత లేకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ వినియోదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొట్టిముక్కల అనంతరావు, ధర్నాలకోట వెంకటేశ్వరరావులు కోరారు. బుధవారం కన్స్యూమర్ వాయిస్, కన్స్యూమర్ రైట్స్ అవేర్నెస్ సెల్ తదితర వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆర్డీవో శివ రాముడు ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొట్టుముక్కల అనంతరావు, ధర్నాలకోట వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా దేశాలలో యుద్ధం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా నిత్య అవసరాల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్రీలంకలో లీటర్ పెట్రోల్, డీజిల్ సుమారు 380 రూపాయలకు పైగా పలుకుతుందని, వంట గ్యాస్ అయితే ఒక సిలిండర్ సుమారు 3,800 వరకు చేరుకుందని అన్నారు. ముఖ్యంగా మన ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న సంస్కరణలు, ముందస్తు చర్యలు కారణంగా మనదేశంలో ప్రస్తుతానికి నిత్యవసర వస్తువులు అందుబాటులో ఉన్నాయని, అయితే యుద్ధం మరింత కొనసాగితే మనదేశంలో కూడా వంట గ్యాస్ తో పాటు పెట్రోల్, డీజిల్ మరియు వంట నూనెలు తదితర నిత్యావసర వస్తువులు కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుంచే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టి భవిష్యత్తులో నిత్యవసరాల కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

### 2026 -27 ఆర్థిక సంవత్సరానికి

# 47లక్షలు లాభాలతో అంచనా బడ్జెట్

### సొసైటీ అధ్యక్షులు బత్తుల - 57.24 లక్ష లాభాల్లో సొసైటీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ సొసైటీని 2026 -27 ఆర్థిక సంవత్సరానికి 47లక్షల రూపాయలు లాభాలు ఉండే విధంగా అంచనా బడ్జెట్ తయారు చేయడం జరిగిందని సొసైటీ అధ్యక్షులు బత్తుల గోపాలకృష్ణ అన్నారు. బుధవారం కోరుకొండ సొసైటీ సర్వజన మహాసభ సీఈఓ ఆకుల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ వెంకట రమణ మాట్లాడుతూ 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సొసైటీ 57.24 లక్షల రూపాయలు లాభాలలో ఉందన్నారు.2025- 26 ఆర్థిక సంవత్సరంలో 521 టన్నుల ఎరువుల ద్వారా లక్ష 55వేల రూపాయలు, 30 టన్నుల వరి విత్తనాల ద్వారా 47 వేల రూపాయలు సొసైటీకి ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది రైతులకు మూడు కోట్ల 43 లక్షల రూపాయలు రుణాలు ఇచ్చామన్నారు. ప్రస్తుతం సొసైటీ టర్న్ ఓవర్ 48 కోట్లు ఉందన్నారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బత్తుల గోపాలకృష్ణ, మాజీ సొసైటీ అధ్యక్షులు పుల్లెపు వీరన్న కాపు, కోణతం నరసింహారావు, సీఈవో ఆకుల వెంకటరమణ, మాజీ సీఈవో సుధాకర్ వర్మ, సొసైటీ సిబ్బంది ఎన్ వీరయ్య దొర, జి రవికుమార్, సిహెచ్ సూర్యచంద్రం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నరసన్న ఇనాం భూములకు 22(ఏ) నుండి విముక్తి : బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయభూములు సుమారు 1,150 ఎకరాలను 22 (ఏ) జాబితాలో చేర్చిన విషయం అందరికీ తెలిసిందే. కోరుకొండ పరిసర గ్రామాల ప్రజలు దశాబ్ది కాలంగా అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటీవల శాసనసభలు బత్తుల బలరామకృష్ణ కృషితో సుమారు 256 ఎకరాలను భూములను 22( ఏ) నుంచి విడుదల చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని శాసనసభ్యులు తెలిపారు. దీంతో బుధవారం కోరుకొండ జనసేనపార్టీ కార్యాలయంలో రైతులు బత్తులను కలిసి హర్షం వ్యక్తం చేస్తూ, పూలమాలవేసి సాల్వో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని గత 20నెలల కాలంలో పలుమార్లు కలిసి వినతి పత్రాలు అందించానన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి కోరుకొండ ఈనామ్ భూముల సమస్యను తీసుకు వెళ్ళనని, దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూ మంత్రి సత్యకుమార్ ని అనేకసార్లు కలిసి కోరుకొండ ఈనాం భూముల బాధిత రైతులకు న్యాయం చేయాలని వినతి పత్రాలు అందించాలని,ఎట్టకేలకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం కోరుకొండ ఈ నామ్ భూములను 22 (ఏ) నుంచి విడుదల చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో పలు గ్రామాల రైతులు బత్తులను కలిసి, కృతజ్ఞతలు చేస్తూ త్వరలోనే మిగిలిన భూములకు కూడా విముక్తి కల్పించి, మిగిలిన రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కరుటూరి రామ్మోహన్,ముంద్రు రామారావు చౌదరి, రొంగల శ్రీనివాస్, ఇసుకపల్లి రాజారావు, ఉప్పలపాటి అబ్బు, ఎన్డీఏ నాయకులు అద్దాల శ్రీను, మేడిశెట్టి శివరాం, బదిరెడ్డి దొర,ముక్క రాంబాబు, కటకం చలం, కర్రిగణేష్, కుచ్చు చెల్లారావు, కొయ్యే సామ్యూల్, తాటికొండ బుజ్జి, శివ,పలు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల్లో మట్టిని తరలించి నీటి సామర్థ్యాన్ని పెంచండి : అడపా సుధీర్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి రైతులకు సబ్సిడీపై యంత్ర సామాగ్రి, ఎరువులు, తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తుందని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని భారతీయ జనతా పార్టీ కోరుకొండ మండల అధ్యక్షులు అడపా సుధీర్ అన్నారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, తెదేపా జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి సంయుక్తంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, రైతులకు అన్ని విధాల వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. మండలంలోని ఆయకట్టు చెరువుల్లో నిబంధనలకు లోబడి తప్పనిసరిగా పూడికతీతంగా తీయించి, నీటి సామర్థ్యాన్ని పెంచి, రైతులకు రెండు పంటలకు పుష్కలంగా నీరు అందించడానికి ప్రతిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా రైతులు తమ పొలాలను మెరక చేసుకోవడానికి, సారవంతం చేసుకోవడానికి సారవంతమైన మట్టిని ఉచితంగా తీసుకువెళ్లి భూములను సార్వంతంగా చేసుకోవాలన్నారు. అదేవిధంగా నరసన్నకు చెందిన 256 ఎకరాలు 22 (ఏ) నుండి తొలగించినందుకు శాసనసభ్యులకు అభినందనలు తెలిపారు.

# సమన్వయ లోపంతో మున్సిపాలిటీ రెవెన్యూ ఎన్నికల అధికారులు

### నూతన పోలింగ్ స్టేషన్ ఏర్పాటుపై అలసత్వం
### రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట తహశీల్దార్ వారి కార్యాలయంలో 48 మండపేట నియోజకవర్గంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సహాయ ఓటరు నమోదు అధికారి, తహశీల్దార్ పి.తేజేశ్వరరావు బుధవారం సమావేశం నిర్వహించియున్నారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి, వెలగపూడి ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల ప్రకారం బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో నెల రోజులలో వచ్చిన ఎన్నికల దరఖాస్తులైన చేర్పులు, మార్పులు, తొలగింపు, కొత్త ఓట్లు నమోదు వివరాలు, స్పెషల్ ఇన్ టెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) కి సంబంధించి ఓటర్ల మ్యాపింగ్ మరియు ప్రోగెనీ మ్యాపింగ్ వివరములు గురించి తెలియజేసియున్నారు. ఇప్పటివరకు ఎన్నికల సిబ్బంది 2002 ఓటర్ జాబితాలో 57 శాతం వారి సంతానం మ్యాపింగ్ చేశారని తేజేశ్వరరావు తెలిపారు. వైసిపి ఐటి విభాగం అధ్యక్షులు యరమాటి వెంకన్నబాబు మాట్లాడుతూ గత సమావేశాలలో మండపేట పెద్ద కాలువ వంతెన వద్ద నుండి రాజారత్న సెంటర్ వరకు ఒక్క పోలింగ్ స్టేషన్ కూడా లేదని ఓటర్లు చాలా ఇబ్బంది పడుతున్నారని పోలింగ్ స్టేషన్ ను ఏర్పాటు చేయవలసినదిగా చెబుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. అదే విధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా సంతానం మ్యాపింగ్ చేయుటకు భార్య, కోడలు ఆప్షన్ లేదని, ఆప్షన్ అవకాశం కల్పించవలసినదిగాను కోరియున్నారు. కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు కొరకు గతంలోనే మున్సిపల్ కమిషనర్ కి పంపడం జరిగిందని బదులిచ్చారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ నాయకులు ఉంగరాల రాంబాబు, మచ్చ నాగబాబు, ఎ.సత్యనారాయణ, యరమాటి వెంకన్నబాబు, ఎం.సుబ్బారావు, మండపేట మున్సిపల్ మేనేజర్ ఉప్పల శ్రీనివాసరావు, కె.గౌరీదేవి, మండపేట ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పి.ఎ.మెహర్ బాబా, ఎన్నికల సిబ్బంది ఎం.పద్మనాభం, గంధం వెంకటరావు, జి.మల్లేశ్వరరావు లు పాల్గొన్నారు.

# తండ్రి కడసారి కోర్కెను నెరవేర్చిన విజయ భారతి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం తొర్రేడు గ్రామానికి చెందిన చిట్టూరి వెంకటరత్నం (83) బుధవారం బూరుగుపూడిలో స్వర్గస్తులైనారు. ఆయనకు ఒక్కగానొక్క గారాల పట్టి విజయభారతి. ఆయనకు కొడుకు లేకపోవడంతో కుమార్తెను తన కడసారి కోరిక "తలకొరివి" నువ్వే పెట్టా, తనకు సంతృప్తి కలిగించాలని అంటుండే వారట. బుధవారం ఆయన చనిపోవడంతో రాజమహేంద్రవరం కైలాసగిరిలో తండ్రి కడసారి కోరిక నెరవేర్చడానికి, తానే కొడికై తండ్రికి తలకొరివి పెట్టి ఆయన కోరికను నెరవేర్చింది. ఇది తిలకించిన ప్రజలు పురుషుల కంటే మహిళలు ఏ విషయంలోను తక్కువ కాదని నిరూపిస్తూ, తండ్రి కడసారి కోరిక నెరవేర్చినందుకు కంటే విజయభారతిని పలువురు అభినందించారు.

### లొల్ల, నదురుబాద గ్రామ పంచాయతీలకు

# టి.బి విముక్త గ్రామ అవార్డు




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం లొల్ల, నదురు బాద గ్రామాలు 2024-25 సంవత్సరానికి గాను టిబి విముక్త గ్రామాలుగా ఎంపికైన సందర్భంగా డా. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం. దుర్గారావు దొర చేతుల మీదుగా ఇరు గ్రామాల సర్పంచులు చాట్రాతి జానకి రాంబాబు, చింతపల్లి శ్రీనివాసరావులు మంగళవారం అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయవరం మండలంలోని తమ గ్రామాలకు ఈ ప్రతిష్టాత్మక అవార్డు రావడం గర్వకారణమని తెలిపారు. దీనికి సహకరించిన ఎమ్ ఎల్ హెచ్ వి, ఏఎన్ఎం, హెల్త్ సిబ్బంది, పంచాయతీ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో తమ గ్రామాలను మరింత ఉన్నత స్థితిలో నిలిపే ప్రయత్నం చేస్తామని వివరించారు.

# చారిత్రక ధనకొండపై బాంబు బ్లాస్టింగ్ కలకలం

### ప్రభుత్వ భూమి ఆక్రమణపై సిపిఐ ఎంఎల్ గిరిజన సంఘం ఆగ్రహం



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం రెవిన్యూ పరిధిలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రభుత్వ ధనకొండపై బాంబు బ్లాస్టింగ్ జరుపుతూ అక్రమంగా భూమిని ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ ఘటనపై సిపిఐ ఎంఎల్ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంఘం నాయకులు తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నెంబర్ 366లో ఉన్న సుమారు 42.65 సెంట్ల ప్రభుత్వ భూమిని బిక్కవోలు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తపల్లవెంకటరెడ్డి బాంబు బ్లాస్టింగ్ ద్వారా ధ్వంసం చేసిఆక్రమిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా సర్వే నెంబర్ 392లో 10 ఎకరాలు 70 సెంట్ల ప్రైవేట్ భూమిని కొనుగోలు చేసిన ఆయన, దానికి ఆనుకుని ఉన్న ధనకొండను రాత్రి సమయంలో పేల్చివేసి సుమారు ఒక ఎకరం మేర ప్రభుత్వ భూమిని తన భూమిలో కలుపుకొని ప్లాట్లుగా మార్చుతున్నట్లు తెలిపారు.ఈ అక్రమ కార్యకలాపాలపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఏలేశ్వరం మండల తహసీల్దార్, కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రోక్లైన్ యంత్రాలతో జరుగుతున్న తవ్వకాల ఫోటోలు, ఆధారాలను సమర్పించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా రాత్రివేళల్ల బాంబు బ్లాస్టింగ్ కొనసాగుతుండడం ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తోందని తెలిపారు. ప్రభుత్వానికి చెందిన చారిత్రక ధనకొండను ఇలాంటి విధంగా ధ్వంసం చేయడం తీవ్ర అన్యాయమని, వెంటనే బ్లాస్టింగ్ కార్యకలాపాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఇకపై జిల్లా స్థాయిలో ప్రత్యేక సర్వే నిర్వహించి, ఆక్రమిత భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, కొండ చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని సిపిఐ ఎంఎల్ గిరిజన సంఘం నాయకులు కోరారు. ఈ విషయంలో నిర్లక్ష్యంవహించినఅధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.చరిత్ర కలిగిన ప్రభుత్వ ఆస్తులను కాపాడటం అధికారుల బాధ్యత అని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సిపిఐ ఎంఎల్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం నాయకులు సిపిఐ ఎంఎల్ మండల కార్యదర్శి గండేటి నాగమణి, సోమల కుశల, మాడెం బాబురావు, వల్లి కొండలరావు, కందుల క్రాంతి కుమార్, కందులకృపాప్రసాద్, పడాల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# ఐ లవ్ వేళంగి జ్యూస్ పార్లర్ ఓపెనింగ్..



**కాకినాడ రూరల్ (కరప), విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామంలో గ్రంథాలయం ఎదురుగా గ్రామానికి చెందిన లక్కల దుర్గాప్రసాద్ ఏర్పాటు చేసుకున్న ఐ లవ్ వేళంగి జ్యూస్ మరియు ఐస్ క్రీమ్ పార్లర్ ను నూతనంగా కుటుంబ సభ్యులు, వేళంగి గ్రామ పెద్దలు, మరియు స్నేహితుల మధ్య ఘనంగా ఓపెనింగ్ చేయడం జరిగింది.

### కాకినాడ ఎన్.సి.ఎస్ (ఎన్సీఎస్) ఇండస్ట్రీస్‌లో

# 55వ జాతీయ భద్రతా దినోత్సవ ముగింపు వేడుకలు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండస్ట్రీస్ ముగింపు వేడుకల కార్యక్రమానికి ఫ్యాక్టరీల డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జి.వి.ఎస్. నారాయణ మరియు ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ కె.రాంబాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముందుగా మొక్కలు నాటే కార్యక్రమంతో వేడుకలు ప్రారంభమయ్యాయి, అనంతరం భద్రతా పరికరాల ప్రదర్శనను సందర్శించారు. సేఫ్టీ మేనేజర్ కే.సాయికృష్ణ భద్రతా నివేదికను సమర్పించిన తర్వాత.. డిసిఐఎఫ్ నారాయణ, ఐఓఎఫ్ రాంబాబు, జిఎం విజయ్ కుమార్, డీజీఎం సాయిరాం, హెడ్ హెచ్ ఆర్ పి ఎస్ ఎన్ మూర్తి మరియు మేనేజింగ్ డైరెక్టర్ నారాయణ మురళి ఉద్యోగులను ఉద్దేశించి సేఫ్టీ ప్రాముఖ్యత గురించి వివరించారు.

# నాగంపల్లిలో ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నాగంపల్లిలో బుధవారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకురాలు జక్కంపూడి విజయ లక్ష్మి ప్రతిష్ట మహోత్సవానికి హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ దోసపాటి వీర చంద్రావు ఆధ్వర్యంలో భారీ ఆంజనేయస్వామి విగ్రహా న్ని ప్రతిష్టించారు. ఈ సంద ర్భంగా స్వామివారిని దర్శిం చుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నా రు. కొవ్వూరు మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరా మారావు (అబ్బులు), స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన సదస్సు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** స్వచ్ఛ సర్వేక్షన్ 2026 స్కూల్ ఎంగేజ్మెంట్ ఆక్టివిటీస్ కార్యక్రమం లో భాగంగా మండపేట పురపాలక సంఘ పరిధిలో గౌతమి మున్సిపల్ స్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులకు స్వచ్ఛత అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి సంబంధించి తడిచెత్త, పొడిచెత్త లను వేరు చేయుట, హోమ్ కంపోస్టింగ్ తయారీ విధానం వాటి ఉపయోగాలు వివరించారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు వంటి అంశాలపై అవగహన కల్పించారు. విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఆర్.అనుష లక్ష్మి శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం.సత్తిరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దంటు శ్రీనివాస్ స్వర్ణ వార్డు శానిటేషన్, ఎన్విరాన్ మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.



# ప్రధాని మోదీని కలిసిన ఎంపీ దగ్గుబాటి దంపతులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ని న్యూఢిల్లీలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావాలపై సంక్షిప్తంగా చర్చించడంతో పాటు, భారతదేశంపై దాని ప్రభావం తక్కువగా ఉండేలా తీసుకున్న చర్యలు, గ్లోబల్ స్థాయిలో భారత్ పోషిస్తున్న నాయకత్వ పాత్ర గురించి వివరించడం జరిగింది.డా. దగ్గుబాటి వెంకటేశ్వరరావు వాజపేయితో తన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో భారతదేశ తరపున మాట్లాడే అవకాశం ఆయన కల్పించిన విషయాన్ని వివరించారు. అలాగే, ఆయన రచించిన "ది గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ " అనే పుస్తకాన్ని ప్రధానమంత్రికి అందజేశారు. ప్రపంచ చరిత్రపై ఇంత విపులమైన గ్రంథాన్ని రచించడానికి చేసిన కృషిని ప్రధానమంత్రి అభినందించారు. అదేవిధంగా, భార్యాభర్తలిద్దరికీ ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో ప్రసంగించే అవకాశం రావడం ఎంతో అరుదైన, గౌరవప్రదమైన విషయమని పేర్కొంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంత బిజీ షెడ్యూల్ మధ్య కూడా తమకు సమయం కేటాయించినందుకు ప్రధానమంత్రికి దగ్గుబాటి పురందేశ్వరి వెంకటేశ్వరరావు దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కుటుంబ గొడవలను రాజకీయాల్లోకి లాగారు

## ఈ విధానం భరత్‌కు అలవాటు - మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు కుటుంబ గొడవలను రాజకీయాల్లోకి లాగారని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మండిపడ్డారు. ప్రస్తుతం ఆయన వాయిస్ తో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియోలపై ఆయన స్పందించారు. అవన్నీ వైకాపా వారు చేసిన ఫేక్ ఆడియోలని ఖండించారు. గత 40 సంవత్సరాల తన రాజకీయ జీవితంలో నగర ప్రజలకు, బడుగు బలహీన వర్గాలకు, ముఖ్యంగా దళిత వర్గాలకు తన వ్యక్తిత్వం సహాయ పడగలను తెలుసు అని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఆపదలో ఉన్న వారికి కష్టాల్లో ఉన్నవారికి ఎంతో సహాయ పడ్డానని, ఒక కుటుంబం వివాదంలో కుల పెద్దమనిషిగా సహాయపడేందుకు తమ మధ్య జరిగిన సంభాషణను వక్రీకరించి తనకున్న రాజకీయ పరపతిని మాజీ ఎంపీ భరత్ కుట్రలు చేస్తున్నాడనీ విమర్శించారు. ముందు ఎన్నికల ముందు అతని తండ్రి వయసు గల తనను వయసు కూడా గౌరవం ఇవ్వకుండా చెప్పు తీసి కొడతానని అహంకారపూరితంగా మాట్లాడినప్పుడే తాను గట్టిగా బుద్ధి చెప్పి ఉండాల్సిందని,ఈరోజు మళ్లీ తన వైపు చూసే సాహసం చేసేవాడు కాదని అన్నారు. ఒక అభాగ్యురాలి కష్టాన్ని అర్థం చేసుకుని ఆమె కాపురాన్ని సరిదిద్దే ప్రయత్నం తాను చేస్తుంటే భరత్ అనుచరులు రంగ ప్రవేశం చేసి ఆ మహిళా కుటుంబ సభ్యులను మభ్యపెట్టి, తమ మధ్య జరిగిన సంభాషణ ఆడియోను అతూకులతో ఎడిట్ చేసి తన వ్యక్తిత్వం పై దుష్ప్రచారం పాల్పడుతున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని, ఆడియోలో నిజానిజాలు నిర్ధారణ చేయాలని కోరుతూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో కుల విద్వేషాలను వైసిపి పార్టీవారు రాజకీయ ఉనికి కోసం రెచ్చగొడుతున్నారని ప్రజలు, దళిత వర్గాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. దళితుల పట్ల తాను ఎప్పుడూ వ్యతిరేకంగా మాట్లాడలేదని, అంటే తాను తన కుటుంబము దళితుల అభ్యున్నతి కోసం ఎంతో చేస్తున్నామని అన్నారు. దళిత సామాజిక వర్గంలో తమ కుటుంబానికి ఉన్న ఆదరణ చూసి మాజీ ఎంపీ భరత్ ఓర్వ లేకపోతున్నాడని, ఈ రెండేళ్లు తమ కుటుంబంపై ఎన్నో లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటు న్నాడని ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. వివాదం పడిన కుటుంబంలోనీ బంధువులు జాన్ అనే వ్యక్తిని అనుచితంగా ప్రవర్తించడంతో కొట్టారని, రాజానగరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందన్నారు.అతనిపై దాడిని తాను, తన వర్గీయులు చేసినట్లుగా భరత్ దుష్ప్రచారం చేయడం భరత్ వక్రబుద్ధికి నిదర్శనం అన్నారు. దాదాపు సంవత్సరంనర క్రితం మా దగ్గరికి వచ్చిన ఒక కుటుంబ వ్యవహారానికి సంబంధించిన సమస్య సందర్భంలో జరిగిన సంభాషణలోని కొన్ని భాగాలను ఇప్పుడు వక్రీకరించి ఆడియోల రూపంలో వైకాపా వారు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆ సంభాషణలో వచ్చిన విషయాలను ఎడిట్ చేసి, అసలు విషయాన్ని మార్చి, మత విద్వేషాలు, కుల విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వైసీపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా దురుద్దేశపూర్వక చర్యని అన్నారు. తమకు దళితులపై ఎప్పుడూ ఎంతో గౌరవం ఉంది.... ఈ రోజు రాజమహేంద్రవరంలో టిడిపి బలంగా ఉండటానికి దళిత సోదర సోదరీమణుల సహకారం ఎంతో ఉందన్నారు. తాము ఎప్పుడూ వారికి తోడుగా ఉన్నారు, వారు ఎప్పుడూ మాకు అండగా ఉన్నారు... అలాంటి వారిని మేమెందుకు కించపరుస్తాం? వైకాపా వారు చేస్తున్న ప్రచారం పూర్తిగా అబద్ధ ప్రచారమని కొట్టిపారేశారు. ఇంతకంటే ఈ విషయంలో నేను ఎక్కువగా చెప్పలేను. ఇప్పటికే సంబంధిత వ్యక్తులు మీడియా ముందుకు వచ్చి వాస్తవాలు వివరించారని గుర్తు చేశారు. అయినా కూడా వాస్తవాలను వక్రీకరించి ఒక ఆడబిడ్డ జీవితాన్ని రోడ్డుపైకి లాగిన విధానం చాలా బాధాకరమన్నారు. ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, వాస్తవా లను గుర్తించాలనీ కోరారు. ఇలాంటి దుష్ప్రచారం, పరువు నష్టం కలిగించే చర్యలపై మేము చట్టపరమైన చర్యలు ఖచ్చితంగా తీసుకుంటాము. వైకాపా వారిని వదిలేదే లేదు... చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తాం. దీనిపై మా లీగల్ టీమ్ పని చేస్తోందన్నారు. మీడియా సమావేశంలో తెలుగుదేశం నాయకులు మజ్జి రాంబాబు, కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, మొకమాటి సత్యనారాయణ, కప్పల వెలుగు కుమారి, తురకల నిర్మల, చాపల చిన్న రాజు, బొర్రా చిన్ని, బుడ్డిగ రవి, కీలపర్తి శ్రీను, నీలాపు వెంకటేశ్వరరావు, ఈతలపాటి రవి, సలాది ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిరెడ్డి అప్పారావుపై కేసు నమోదు చెయ్యాలి

## దళితులను కించపరిచినందుకు కేసు నమోదు చేయాలి - దళితులకు క్షమాపణ చెప్పాలి - ఆదిరెడ్డి దళిత వ్యతిరేక వైఖరి అంటూ..నినాదాలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక కుటుంబ వివాదం సందర్భంగా దళితులను అవమానపరిచిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని, తెలుగుదేశం పార్టీ నుండి చంద్రబాబు బహిష్కరించాలని, దళితులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వైఎస్ఆర్సిపి జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ వారి తో పాటు దళిత నాయకులు, డిమాండ్ చేశారు. దళితులను కించపరిచారన్న ఆడియో ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన సందర్భంగా దళితుల మనోభావాలను దెబ్బతీసిన ఆదిరెడ్డి అహంకార పూరిత వైఖరి ని ఖండిస్తూ వైఎస్ఆర్సిపి శ్రేణులు, దళిత వర్గాలు సంయుక్తంగా బుధవారం స్థానిక గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులు అర్పించారు. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్, ఆదిరెడ్డి అరాచకాలు నశించాలని, దళితులకు క్షమాపణ చెప్పాలి, ఆదిరెడ్డి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి, చేయాలని తెలుగుదేశం పార్టీ నుంచి బహిష్కరించాలని ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టిజిఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు మితిమీరి పోతున్నాయని, నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట దళితులపై అని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ఎమ్మెల్యే తండ్రి గా, ప్రజా ప్రతినిధిగా పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దళితులను కించపరిచిన చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమని, వివక్షతతో కూడుకున్నవని ఆయనపై ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులను బేషరతగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో దగా పడిన దళితులకు వైఎస్ఆర్సిపి, న్యాయం జరిగేంత వరకు అండగా నిలుస్తుందన్నారు. జడ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో చాలామంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు దళిత వర్గాలను వేధిస్తున్నాయని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలు మారినా, ప్రభుత్వాలు మారినా దళితులపై దాడులు మాత్రం ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా రాజకీయంగా విద్యాపరంగా చైతన్యవంతమైన తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ గా చేసిన అప్పారావు దళితులను అవమానకరంగా మాట్లాడటం అంబేద్కర్ రాజ్యాంగాన్ని ధిక్కరించినట్లేనని ఆయనపై తప్పనిసరిగా ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేయని యెడల న్యాయపరంగా ఏ స్థాయికి వరకు అయినా వెళ్లి కేసు పెట్టేలా అంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. దళితులను కించపరిచిన అప్పారావు పై సొంత తెలుగుదేశం పార్టీలోని దళిత నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు. దళితుని మృతదేహాన్ని ఒక వీధిలోకి రాకుండా అడ్డుకున్న సంఘటన సిగ్గుచేటు అన్నారు. ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడిన విధంగా వైసిపి పార్టీ వారు మాట్లాడితే ఈపాటికి కేసులు పెట్టి జైలుకు పంపించేవారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితుల ఆత్మగౌరవం, రక్షణ కోసం పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ కూ టమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలు నుంచి దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ప్రధానంగా ప్రజాప్రతినిధుల పాత్ర ఎక్కువగా ఉందన్నారు, ఒక వివాదంలో పెద్దమనిషిగా ఉన్న మాజి ప్రజా ప్రతినిధి దళితులను కులం పేరుతో దూషించడం, చంపేస్తానని బెదిరించడం దాడులు చేయడం గర్హనీయం అన్నారు. మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం కలిగించిన దళితులపై దూషణ, దాడుల సంఘటనలో మాజీ ఎమ్మెల్సీ అప్పారావును తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో ఆదిరెడ్డి అప్పారావుకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం షోకాజు నోటీసు ఇవ్వలేదని దళితుల రక్షణ పట్ల ఆ పార్టీ అధిష్టానానికి ఆలోచన లేదా అని ప్రశ్నించారు , దళితుడిని కొట్టి హత్యాయత్నం చేసిన ఆయనపై కేసు కట్టని పోలీస్ అధికారులు బాధితునీ పైన కేసు పెట్టడం దారుణం అన్నారు. టిడిపి దళితులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కేసు కట్టేంతవరకు ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దళిత వర్గాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు నాయకులు, మహిళలు, దళిత వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బొత్సను పరామర్శించిన పాపారాయుడు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైసీపీ రాష్ట్ర రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి, ఏపీ శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణను వైసిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాజోలు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు కర్రి పాపారాయుడు బుధవారం పరామర్శించారు. విజయనగరం జిల్లాలోని బొత్సా నివాసానికి పార్టీ నాయకులు సిరిపురపు శ్రీనివాస్, సాధనాల శివ భగవాన్ తదితరులతో కలిసి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# వాలిడేషన్ యాక్ట్ ఉపసంహరించాలి



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** 2020 జనవరి 1వతేదీ నుండి కేంద్ర ప్రభుత్వం పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో ఉద్యోగులకు, పెన్షన్ దారులకు కరువు భత్యం వేతన సవరణల ద్వారా పెరిగే వేతనాలను అడ్డుకునేందుకు వ్యాలిడేషన్ యాక్ట్ అమలు చేయబో నుంది, ఈ యాక్టర్ వ్యతిరేకిస్తూ భారతదేశంలో గల అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్ ద్వారా ప్రధానమంత్రి కి వినతిపత్రం అందజేయుటలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏపీఎస్ జి ఆర్ ఈ ఏ) జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఏపీఎస్జిఆర్ఈఏ అధ్యక్షులు పి ఎస్ ఎస్ ఎన్ బి శాస్త్రి మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ పెన్షనర్లు ఎన్నో పోరాటాలు చేసి అనాదిగా పొందుతున్న హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వాలిడేషన్ యాక్ట్ తీసుకు రావడం బాధాకరం, ప్రజా ప్రతినిధులకు వారు పొందే రాయితీలు సక్రమంగా పొందుతూ కేవలం విశ్రాంత ఉద్యోగులపై ఇటువంటి యాక్ట్ ప్రయోగించడం పండు టాకులపై ఉక్కు పాదం మోపేదిగా ఉందని ఇదే విషయమై సర్వోన్నత న్యాయస్థానం కూడా గతంలో అభిశంచిందని కావున తక్షణం ఈ యాక్ట్ ను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు, జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఎనిమిదో వేతన సవరణ సంఘం తక్షణం నియమించాలని వ్యాలిడేషన్ యాక్ట్ ఉపసంహరించే వరకు విశ్రమించేది లేదని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఓపక్క విద్య వైద్యం నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతుండడం , కాస్తో కూస్తో అధిక వేతనం పొందుతున్న వారి నుండి ఆదాయ పన్ను ద్వారా తిరిగి రాబట్టుకోవడం కేంద్ర ప్రభుత్వం విదానంగా ఉందని ఇటువంటి పరిస్థితుల్లో వాల్యుయేషన్ యాక్ట్ అంధకారమయం చేస్తుందని కావున యాక్ట్ రద్దు చేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో ధవలేశ్వరం లాలాచెరువు, రాజమహేంద్రవరం తాళ్లపూడి దేవరపల్లి నల్లజర్ల నిడదవోలు తదితరు యూనిట్ నుండి సుమారు 100 మంది పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసిన

# ఆర్ఎంపీ, పీఎంపీ జేఏసీ నాయకులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** న్యూఢిల్లీ పార్లమెంట్ భవనం లో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను, కేంద్ర విమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు సహాయంతో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ జేఏసీ గౌరవ అధ్యక్షులు టి.జనార్ధన్ ఆధ్వర్యంలో జాతీయ పీఎంపీ, ఆర్ఎంపీ జాయింట్ యాక్షన్ కమిటీ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి జాతీయ స్థాయిలో పీఎంపీ, ఆర్ఎంపీల సమస్యల గురించి వివరించి, జాతీయ స్థాయిలో గుర్తింపు గురించి వివరించారు.ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గ్రామాల్లో ప్రాథమికంగా వైద్య సేవలందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ ల సమస్యను పరిశీలిస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ జేఏసీ అధ్యక్షులు డాక్టర్ కేజీ గోవింద్ రెడ్డి,ఆంధ్రప్రదేశ్ నుండి జాతీయ కన్వీనర్ వీబీటీ రాజు,ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బళ్ళా శ్రీనివాసరావు,ఏపీ జేఏసీ కన్వీనర్ జీఎస్ ప్రసాద్,ఎమ్ సుధాకర్, జాతీయ జేఏసీ నాయకులు గుజరాత్ నుండి సీఎస్ రావు,షకారియా నవీన్ చంద్ర,తెలంగాణ నుండి పుల్లం మోహన్,ఉత్తర ప్రదేశ్ నుండి ఓపీ మిశ్రా, యోగేష్ జోస్వాల్, బీహార్ నుండి అన్నూ తివారీ, పంజాబ్ నుండి ధన్మాల్ గోయల్, గుస్మైల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# బర్రే కొండబాబు నిజమైన ప్రజా నాయకుడు

## క్వారీ ప్రాంత ప్రజలకు ఏ కష్టం వచ్చినా కొండబాబు అండగా ఉంటారు - మండలి చైర్మన్ మోషేన్ రాజు
## మోషేన్ రాజు, బర్రే కొండబాబు చేతుల మీదుగా పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్వారీ ప్రాంత ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే నగర పాలకసంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు పేద ప్రజలకు నిత్యవసర వస్తువులు అందచేయడం గొప్ప విషయమని శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు అభినందించారు. బుధవారం సుబ్బారావు నగర్ లోని బర్రే కొండబాబు నివాసానికి మోషేన్ రాజు విచ్చేశారు.ఈ సందర్భంగా కొండబాబు కుటుంబ సభ్యులు మండలి చైర్మన్ మోషేన్ రాజుకు శాలువా కప్పి పూలమాలలు వేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం కొన్ని పేద కుటుంబాలకు బియ్యం, కూరగాయలు,నిత్యవసర వస్తువులు,గుడ్లు,నూతన వస్త్రాలు మోషేన్ రాజు చేతుల మీదుగా బర్రే కొండబాబు పంపిణి చేశారు.ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు మాట్లాడుతూ క్వారీ ప్రాంత ప్రజలకు ఏ కష్టం వచ్చినా కొండబాబు అండగా ఉంటారని కొనియాడారు.మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు ఈ ప్రాంతంలోని బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు 44 ఎకరాల స్థలాన్ని ఐదేసి సెంట్లు చొప్పున ఉచితంగా ఇచ్చిన మహానుభావుడని,అలాంటి మంచి మనసున్న నేత బత్తిన సుబ్బారావు జయంతి, వర్ధంతులను బర్రే కొండబాబు ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తూ బత్తిన పేరు చిరస్థాయిగా నిలిచేలా చేస్తున్నారని అభినందించారు.అలాగే పేద కుటుంబాలను ఆదుకునేందుకు నిత్యవసర వస్తువులు అందచేస్తున్న బర్రే కొండబాబు నిజమైన ప్రజా నాయకుడని మోషేన్ రాజు కొనియాడారు. కొండబాబు మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బర్రే అనూ హెలేనియా, బర్రే మరియ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజార్లో కిరాణాకు రెక్కలొచ్చాయి

## ధరల నియంత్రణ లేని రైతు బజార్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులను ఆదుకునేందుకు పేద మధ్యతరగతి ప్రజలపై ధరల భారం పడకుండా ఏర్పాటు చేసిన రైతు బజార్లు నేడు దళారుల వసమయ్యాయి. ముఖ్యంగా రైతు బజార్లో షాప్ నెంబర్ 24 నిత్యవసర కిరాణా సరుకుల దుకాణంలో మండపేట మున్సిపల్ మార్కెట్‌లో ఉన్న ధరలకన్నా అధికంగా ధరలు కనిపిస్తాయి. ఇదేమని ప్రశ్నించడానికి కిరాణా ధరలు పట్టిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం కోసమేరుపు. రైతుబజార్లో కిరాణా ధరలపట్టిక ఏర్పాటు చేయకపోవడం పట్ల అధికారులు షాపు యాజమాన్యం కలిసి అధిక ధరలను ప్రోత్సహిస్తున్నారా అనే అనుమానాన్ని ప్రజలు వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వాలు వైద్యులు పౌష్టిక ఆహారంగా పరిగణించే కోడి గుడ్డును సైతం బయట మార్కెట్ల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతు బజార్లో ఉన్న షాపులు ఒక్కొకటిగా ధరలు పెంచుకుంటూ విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగిస్తున్నారని ప్రజలు ముక్తకంఠంతో చెప్తున్నారు. దీనిపై అధికారులు ధరలు నియంత్రణపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటుచేసిన రైతుబజార్ ప్రాముఖ్యతను కాపాడాలని కోరుకుంటున్నారు.




హైదరాబాద్ కల్చర్ నేపథ్యంలో దిల్ రాజు కుమారుడి సినిమా..

# 'దేత్తడి' గ్లింప్స్ చూశారా?



రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన యంగ్ ట్యాలెంటెడ్ ఆశిష్ హీరోగా, సక్సెస్‌ఫుల్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి'. ఈ ప్రాజెక్ట్ తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ గ్లింప్స్ లాంచ్ చేశారు. ఈ గ్లింప్స్ హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పండుగలు, వేడుకలకు ఉత్సాహాన్ని నింపే పాపులర్ డ్రమ్మర్ ఘున్ను భాయ్ వరల్డ్ ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ఘున్ను భాయ్, అతని టీం దాదాపు ఏడు కిలోల డ్రమ్ములను మోస్తూ, గంటల తరబడి విరామం లేకుండా ప్రదర్శన ఇస్తూ ప్రశంసలు అందుకున్నారు. ఆ సంగీతం వెనుకకనిపించే ఆత్మగౌరవం, హుందాతనం ఉన్నాయి. ఈ గ్లింప్స్ ఆ విషయాన్ని ఎంతో సున్నితంగా, శక్తివంతంగా ప్రజెంట్ చేసింది. ఆశిష్ నటన అద్భుతంగా వుంది. అతని రఫ్ మేకోవర్ ఆ పాత్రకు చక్కగా సరిపోయింది. ఆ పాత్రలో ఎంత సహజంగా జీవించారు. అతని హావభావాలు, నేచురల్ ప్రజెన్స్, డ్రింక్ చేసే విధానం, అలవోకగా పలికే హైదరాబాద్ యాస ఈ పాత్రకు బలమైన మాస్ ఫ్లేవర్‌ను జోడించాయి. ఫస్ట్ టైం డైరెక్టర్ గా ఆదిత్య రావు గంగాసాని కథనాన్ని అద్భుతమైన పట్టుతో నడిపించారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, దిల్ రాజు ప్రొడక్షన్ భారీ స్థాయిలో నిర్మించారు. ఆ స్కేల్ ఈ చిన్న గ్లింప్స్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. స్క్రీన్‌ప్లే రచయితగా, సంభాషణల రచయితగా, క్రియేటివ్ హెడ్‌గా వ్యవహరిస్తున్న ప్రసన్న కుమార్ బెజవాడ మార్క్ స్పష్టంగా కనిపిస్తుంది. విజువల్స్ కలర్ ఫుల్ గా వుండగా, సంగీత దర్శకుడు జునైద్ కుమార్ ఉర్రూతలూగించే డ్రమ్ బీట్స్‌తో పండుగ వాతావరణాన్ని మరింత పెంచారు. మొత్తం మీద, పర్ఫెక్ట్‌గా కట్ చేసిన ఈ గ్లింప్స్, సినిమా ఏమి అందించబోతోందో స్పష్టంగా ప్రజెంట్ చేసింది. చిత్రం థియేటర్లలోకి రావడానికి సిద్ధమవుతోందని సూచిస్తూ.. "జాతర త్వరలో ప్రారంభమవుతుంది," అని చిత్ర నిర్మాతలు ప్రకటించారు. 'ది గ్లింప్స్' అత్యద్భుతంగా లాంచ్ చేశారు. 500 మందికి పైగా స్ట్రీట్ డ్రమ్మర్లు ఏకతాటిపై హోరెత్తిస్తూ, వాతావరణాన్ని ఎనర్జీని నింపేశారు. వారి ఉత్సాహభరితమైన పెర్ఫార్మెన్స్ ఈవెంట్ స్థాయిని పెంచడమే కాకుండా, సినిమాపై అంచనాలను మరింత పెంచింది.

గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ లో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. దేత్తడి కథ పుట్టడానికి కారణం ఆదిత్య. హైదరాబాదులో ఉండే కల్చర్ ఫెస్టివల్స్ గురించి ఈ సినిమా, ఒక బ్యాండ్ కొట్టుకునే కుర్రాడు గురించి తన లైఫ్ లో చూసిన ఇన్సిడెంట్ అన్నిటిని ఘున్ను అనే క్యారెక్టర్ తో ఒక కథ రాసుకొని హైదరాబాదులో ఉండే ఎల్లమ్మ లగ్గం దగ్గర నుంచి బోనాలు, వినాయక చవితి, సదర్.. ఇలా హైదరాబాద్ కల్చర్ గురించి ఈ సినిమా తీయబోతున్నాడు. ఏడాదిగా ఆదిత్య ఆశిష్ బ్యాండ్ వాయించే వాళ్ళ చుట్టూ తిరుగుతూ వాళ్ల గురించి తెలుసుకుంటూ వాళ్ళ లైఫ్ లో ఉండే ఇన్సిడెంట్ అన్ని పోగుచేసుకొని దేత్తడి కథని ఫైనల్ గా రాశారు. ఈవెంట్ కి హైదరాబాదులో ఉండే బ్యాండ్ కంపెనీస్ అందరి దగ్గరికి వెళ్లి కలిశారు. తమ గురించి సినిమా తీస్తున్నారని ఆనందంతో ఫ్రీగా దాదాపు ఆరు వందల మంది వచ్చి ఈవెంట్లో పార్టిసిపేట్ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాదులో ఉన్న బ్యాండ్ పీపుల్ అందరికీ కూడా మా ధన్యవాదాలు. గత ఏడాదిగా ఆశిష్ ఈ సినిమా కోసం ప్రతి బ్యాండ్ వాళ్ళ దగ్గరికి వెళ్లి బ్యాండ్ ఎలా కొట్టాలి, ఎన్ని బ్యాండ్స్ ఉంటాయి.. ఇలా నేర్చుకుని ఈ సినిమా కోసం రెడీ అయ్యాడు. ఆశిష్ ఆదిత్య వాళ్ళ టీం చేస్తున్న ప్రయత్నానికి ఆల్ ది బెస్ట్ చెప్తున్నాను. ఆదిత్య కథ అద్భుతంగా రాసుకున్నాడు. ఆదిత్యతోపాటు ప్రసన్న ఈ స్క్రిప్ట్ ని ఫుల్ పూర్తిస్థాయిలో రాసుకున్నారు. హైదరాబాద్ కల్చర్ ని ప్రపంచానికి గొప్పగా చూపించబోయే సినిమాతో వస్తున్నారు. టీం అందరికీ ఆల్ ది బెస్ట్ అండ్ కంగ్రాజులేషన్స్. హీరో ఆశిష్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఒక ఏడాది క్రితం ఆదిత్య ఒక గ్లిమ్స్ చూపించారు. అది చూసి చాలా సర్ప్రైజ్ అయ్యాను. ఏడాదిగా కష్టపడుతున్నాం. సినిమా రిలీజ్ అయిన అడియన్స్ మా కష్టాన్ని చూస్తారు. మమ్మల్ని బ్లెస్ చేయడానికి వచ్చిన అందరికీ థాంక్యూ సో మచ్. మన హైదరాబాద్ కల్చర్ ని ఒక దేత్తడి రేంజ్ లో చూపించడానికి వస్తున్నాం. సినిమా అద్భుతంగా తీశారని మీరు మెచ్చుకునేలా ఈ సినిమా ఉంటుంది. ప్రతి బ్యాండ్ గర్వపడేలా ఈ సినిమా తీస్తాం. మీతో పాటు మా ఇజ్జత్ కోసం ఈ సినిమా తీస్తున్నాం. ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఇక్కడికి వచ్చిన ప్రతి బ్యాండ్ వ్యక్తికి ధన్యవాదాలు. డైరెక్టర్ ఆదిత్య మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. మా టీం ని సపోర్ట్ చేసిన దిల్ రాజు గారికి ధన్యవాదాలు. ఈ సినిమా ముందుకెళ్లడానికి కారణం మా హీరో. ఆయనే మొదటగా కథని నమ్మారు. అక్కడి నుంచి మా జర్నీ మొదలైంది. మన పండగలు మన పాటలు మన హైదరాబాద్ కల్చర్ ఇవన్నీ కూడా ఈ సినిమాలో చూపించాలని నా కోరిక. ఈ కథ ఈ సినిమా నామీద ఒక బాధ్యతను పెంచింది. కచ్చితంగా మంచి సినిమాను తీస్తున్నాం. అందరికీ గుర్తుండిపోయే సినిమాను తీస్తాం. రైటర్ ప్రసన్న మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈవెంట్ కి వచ్చి సపోర్ట్ చేస్తున్న బ్యాండ్ కమ్యూనిటీ మొత్తానికి థాంక్యూ సో మచ్. ఈ సినిమా వచ్చిన తర్వాత బ్యాండ్ ఆర్టిస్ట్ అనే గౌరవం తెచ్చేలాగా ఉంటుంది. ఇప్పటివరకు హైదరాబాది బ్యాక్ డ్రాప్ లో చాలా సినిమాలు వచ్చాయి. కానీ అసలైన హైదరాబాద్ కల్చర్ చూపించే ఫస్ట్ సినిమా ఇదే కాబోతోంది. త్వరలోనే మీ ముందుకు వస్తాం. మీ అందరి ఆశీస్సులు కావాలని కోరుకుంటున్నాను.

# తమన్నా అందం రహస్యం ఇదే!

'టర్కోయిస్' రంగుతో క్యాజువల్ గ్లామర్



ఫ్యాషన్ అంటే కేవలం ఖరీదైన దుస్తులు మాత్రమే కాదు, మనం ఎంచుకునే చిన్న చిన్న యాక్సెసరీస్ కూడా మన రూపురేఖలను మార్చేస్తాయి. తమన్నా ప్రకారం, ఆభరణాలలో 'టర్కోయిస్' రంగును ఉపయోగించడం వల్ల ఒక రకమైన 'క్యాజువల్ గ్లామర్' వస్తుంది. బాలీవుడ్, టాలీవుడ్‌లో తనదైన స్టైల్ స్టేట్‌మెంట్‌తో ఎప్పుడూ వార్తల్లో నిలిచే నటి తమన్నా భాటియా. రెడ్ కార్పెట్ వేడుకలైనా లేదా సాధారణ విమానాశ్రయ ప్రయాణాలైనా, ఆమె ఎంతో హుందాతనంగా, ఆకర్షణీయంగా ఎలా కనిపిస్తారని చాలామంది ఆశ్చర్యపోతుంటారు. ఇటీవల సోషల్ మీడియా వేదికగా తన ఫ్యాషన్ రహస్యాన్ని వెల్లడించారు తమన్నా. ఒక చిన్న మార్పుతో సాధారణ లుక్‌ను కూడా ఎలా అద్భుతంగా మార్చుకోవచ్చో ఆమె వివరించారు.

### టర్కోయిస్ రంగు ప్రత్యేకత..

"టర్కోయిస్ అనేది శతాబ్దాలుగా ఆభరణాల ప్రేమికులను ఆకర్షిస్తున్న రంగు. వివిధ కాలాలు, సంస్కృతులలో ఈ రంగుకు ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంది. ఇది శక్తివంతంగా, ఆశాజనకంగా మరియు చూడగానే గుర్తించదగినదిగా ఉంటుంది," అని తమన్నా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

### తమన్నా స్టైల్ టిప్స్

**అన్ని రకాల చర్మ ఛాయలకు :** టర్కోయిస్ రంగులోని గొప్పతనం ఏంటంటే, ఇది ప్రతి చర్మ ఛాయ మీద అద్భుతంగా కనిపిస్తుంది. ఇది కేవలం తెల్లగా ఉన్నవారికే కాదు, అందరికీ నప్పుతుంది.

**సింపుల్ అండ్ రిఫ్రెష్ :** సాధారణ దుస్తులు ధరించినప్పుడు కూడా ఒక చిన్న టర్కోయిస్ స్టోన్ ఉన్న నెక్లెస్ లేదా ఇయర్ రింగ్స్ ధరిస్తే, ఆ లుక్ వెంటనే రిఫ్రెష్‌గా మారుతుంది.

**క్యాజువల్ గ్లామర్ :** భారీగా ఆభరణాలు ధరించడం ఇష్టం లేని వారు, ఈ రంగును ఎంచుకోవడం ద్వారా చాలా సహజంగా, స్టైలిష్‌గా కనిపించవచ్చు.

### నిపుణుల అభిప్రాయం..

సాధారణంగా మనం బంగారం లేదా వెండి ఆభరణాలకు ప్రాధాన్యత ఇస్తాం. కానీ తమన్నా చెప్పినట్లు ఇలాంటి వైబ్రెంట్ రంగులను మన వార్డ్‌రోబ్‌లో చేర్చుకోవడం వల్ల మన పర్సనాలిటీకి ఒక కొత్త వెలుగు వస్తుంది. ముఖ్యంగా వేసవి కాలంలో ఈ ఆకాశనీలం రంగు కళ్ళకు ఎంతో చల్లదనాన్ని, క్లాసీ లుక్‌ను ఇస్తుంది. తమన్నా భాటియా ఫ్యాషన్ సెన్స్ ఎప్పుడూ కొత్తగా ఉంటుంది. కేవలం బ్రాండెడ్ వస్తువులే కాకుండా, ఇలాంటి చిన్న చిన్న ట్రిక్స్‌ను ఉపయోగించి మనం కూడా మన రోజువారీ లుక్‌ను సెలబ్రిటీల రేంజ్‌లో మార్చుకోవచ్చు. మీ తదుపరి షాపింగ్‌లో ఒక టర్కోయిస్ జ్యువెలరీని చేర్చుకోవడం మర్చిపోకండి!

క్రీడా వాయిస్

# ఆ ముగ్గురి దెబ్బకు అభి'షేకింగ్'..

వన్డే ప్రపంచకప్ నుంచి గెంటేశారుగా..?



దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్ కోసం టీమ్ ఇండియా ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా ఓపెనింగ్ స్థానం కోసం యువ సంచలనం అభిషేక్ శర్మతో పాటు మరో ముగ్గురు కీలక ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. వీరిలో తుది జట్టులో చోటు దక్కించుకునే ఆ అదృష్టవంతుడు ఎవరో అన్నది ఆసక్తికరంగా మారింది. 2027 వన్డే ప్రపంచకప్ సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాల్లో జరగనుంది. ఈ మెగా టోర్నీ కోసం బీసీసీఐ ఇప్పటికే 20 మంది సమర్థులైన ఆటగాళ్లను గుర్తించినట్లు సమాచారం. ఈ జాబితా నుంచే తుది 15 మంది సభ్యులను ఎంపిక చేయనున్నారు. రోహిత్ శర్మ, ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రధాన ఓపెనర్లుగా బరిలోకి దిగే అవకాశం ఉన్నప్పటికీ, ప్రత్యామ్నాయ ఓపెనర్ స్థానం కోసం ముగ్గురు ఆటగాళ్ల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. యువ ఆటగాడు అభిషేక్ శర్మ తన అద్భుతమైన బ్యాటింగ్ శైలితో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ముఖ్యంగా దక్షిణాఫ్రికా లాంటి వేగవంతమైన పిచ్‌లపై ఇతని ఆట తీరు జట్టుకు కలిసి వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయినప్పటికీ, వన్డే ఫార్మాట్‌లో ఇప్పటికే తన ముద్ర వేసిన యశస్వి జైస్వాల్ నుంచి అతనికి గట్టి పోటీ ఎదురవుతోంది. జైస్వాల్ ఇప్పటివరకు ఆడిన వన్డేల్లో 57 సగటుతో పరుగులు సాధించి సెలెక్టర్ల నమ్మకాన్ని గెలుచుకున్నాడు. జైస్వాల్‌ను కాదని అభిషేక్ శర్మకు అవకాశం దక్కడం అంత సులభం కాకపోవచ్చు. ఓపెనింగ్ రేసులో వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ పేరు బలంగా వినిపిస్తోంది. ఇషాన్ కిషన్ కేవలం ఓపెనర్‌గానే కాకుండా, రిజర్వ్ వికెట్ కీపర్‌గా కూడా జట్టుకు ఉపయోగపడతాడు. గతంలో బంగ్లాదేశ్‌పై వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన రికార్డు ఇతని సొంతం. 24 వన్డే ఇన్నింగ్స్‌లలో 42 సగటుతో 933 పరుగులు చేసిన ఇషాన్, 102 స్ట్రైక్ రేట్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడగలడు. ఈ బహుముఖ ప్రజ్ఞ ఇషాన్‌ను రేసులో ముందుంచుతోంది. చివరికి యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలలో ఎవరిని ఎంపిక చేయాలనేది సెలెక్టర్లకు పెద్ద సవాలుగా మారింది. జట్టు సమతుల్యతను దృష్టిలో ఉంచుకుంటే ఇషాన్ కిషన్‌కు మొగ్గు చూపే అవకాశం ఉంది. అయితే భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుంటే జైస్వాల్ లేదా అభిషేక్ శర్మలకు ప్రాధాన్యత దక్కవచ్చు. రాబోయే సిరీస్‌లలో వీరి ప్రదర్శన ఆధారంగానే ప్రపంచకప్ బెర్త్ ఖరారు కానుంది. పొట్టి ఫార్మాట్‌లో అదరగొట్టిన అభిషేక్ శర్మ.. ఇంకా వన్డేల్లో ఆకట్టుకోలేదు. ఒకవేళ వన్డే జట్టులో స్థానం దక్కించుకుని బాగా రాణిస్తే, వన్డే ప్రపంచకప్ తర్వాత భారత జట్టులో నిలకడగా చోటు దక్కించుకోవచ్చు. ఏది ఏమైనా 2027 ప్రపంచకప్ లోపు బీసీసీఐ ఎలాంటి ప్లాన్స్ తో ముందుకు వెళ్తుందో చూడాలి.

# ఒక్కడితోనే చస్తున్నాం.. SRHలో మరో డేంజరస్ ప్లేయర్..



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్ శిబిరంలో ఒక యువ సంచలనం సత్తా చాటుతోంది. పంజాబ్ యువ హిట్టర్ సలీల్ అరోరా తన బ్యాటింగ్ విన్యాసాలతో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌లోనే వరుసగా 5 సిక్సర్లు బాది వార్తల్లో నిలిచిన ఈ పవర్ హిట్టర్ గురించి పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం! ఐపీఎల్ 2026 సీజన్ సమరానికి సిద్ధమవుతున్న వేళ ఆరెంజ్ ఆర్మీకి ఒక కొత్త ఆశాకిరణం దొరికింది. పంజాబ్ క్రికెట్ నుంచి దూసుకొచ్చిన యువ బ్యాటర్ సలీల్ అరోరా ఈసారి ఎస్‌ఆర్‌హెచ్ తరపున అరంగేట్రం చేయబోతున్నాడు. గత వేలంలో సన్‌రైజర్స్ యాజమాన్యం ఇతర జట్లతో పోటీపడి మరి రూ. 1.50 కోట్లకు ఈ యువ ప్రతిభావంతుడిని సొంతం చేసుకుంది. దేశవాళీ క్రికెట్‌లో ఇప్పటికే తన పవర్ హిట్టింగ్‌తో గుర్తింపు పొందిన సలీల్, ఇప్పుడు ఐపీఎల్ వంటి భారీ వేదికపై సత్తా చాటాలని చూస్తున్నాడు.

### ప్రాక్టీస్ మ్యాచ్‌లో విధ్వంసం..

టీమ్ ఇండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ సైతం సలీల్ అరోరా బ్యాటింగ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల జరిగిన ఎస్‌ఆర్‌హెచ్ ఇంట్రా-స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో సలీల్ ఊహించని రీతిలో బ్యాటింగ్ చేశాడు. కేవలం 13 బంతుల్లోనే 40 పరుగులు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో వరుసగా ఐదు బంతుల్లో ఐదు సిక్సర్లు బాదడం విశేషం. ఈ అద్భుత ప్రదర్శన చూసిన క్రికెట్ విశ్లేషకులు అతన్ని మరో 'అభిషేక్ శర్మ'గా అభివర్ణిస్తున్నారు.

### మిడిల్ ఆర్డర్‌లో గట్టి పోటీ..

సలీల్ అరోరా రాకతో ఎస్‌ఆర్ హెచ్ మిడిల్ ఆర్డర్‌లో పోటీ పెరిగింది. ఇప్పటికే జట్టులో ఉన్న నితీష్ కుమార్ రెడ్డి లేదా అనికేత్ వర్మ వంటి ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో రాణించకపోతే, సలీల్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. బెంచ్ మీద ఇంతటి ప్రతిభావంతుడైన ఆటగాడు ఉండటం వల్ల ప్రధాన ఆటగాళ్లపై ఖచ్చితంగా ఒత్తిడి ఉంటుందని ఇర్ఫాన్ పఠాన్ తన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. పంజాబ్ నుంచి వచ్చిన అభిషేక్ శర్మ, రమణ్‌దీప్ సింగ్ వంటి ఆటగాళ్లు ఇప్పటికే ఐపీఎల్‌లో తమ ముద్ర వేశారు. ఇప్పుడు అదే బాటలో సలీల్ అరోరా కూడా పయనిస్తున్నాడు. ఒకవేళ ఈ సీజన్‌లో అతనికి అవకాశం దక్కితే, ఎస్‌ఆర్ హెచ్ మిడిల్ ఓవర్లలో మరింత వేగంగా పరుగులు సాధించే వీలుంటుంది. ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ కూడా ఈ కొత్త పవర్ హిట్టర్ మెరుపులను చూసేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com